



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక :233 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :233 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI FRI 4 SEPTEMBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## స్థానిక సంస్థల ఎన్నికలకు వైయస్ఆర్‌సీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

- ఎస్ఐఆర్ గడువు పెంపును సద్వినియోగం చేసుకోవాలి
- ఐడీ కార్డుల పంపిణీతో కార్యకర్తలను మరింత క్రియాశీలం చేయాలి
- గ్రామస్థాయి నుంచి ఎన్నికల సన్నద్ధతకు పటిష్ట ప్రణాళిక
- వైయస్ఆర్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

- మిగతా 2లో




## పాలన పక్కన పెట్టి ఈవెంట్ మేనేజ్‌మెంట్

### చంద్రబాబుపై గుడివాడ అమర్నాథ్ విమర్శలు

- పోలవరం పనులు పూర్తయినట్టు ప్రజలను మోసం చేస్తున్నారన్న గుడివాడ
- నీటిని పంప్ చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శ
- నిజమైన ప్రాజెక్టు నిర్మాణాన్ని గాలికి వదిలేశారని ఆరోపణ

- మిగతా 2లో






## మోదీని అడిగే దమ్ముందా?..

### తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

- మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన
- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్
- తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ
- మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన
- ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్

- మిగతా 2లో



## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్..

### రూ.3.54 కోట్ల ఆస్తులు గుర్తింపు

పెన్ పవర్ డెస్క్:సూర్యాపేట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమ య్యను ఆదాయానికి మించి ఆస్తులు కూడ బెట్టారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసిన అధికారులు.. ఆయన

- మిగతా 2లో

## వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు

# నీటి విడుదలపై వైకాపా దుష్ప్రచారం

- జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వడం లేదంటూ వైకాపా తప్పుడు ప్రచారం
- వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ నీటి విడుదలపై దుష్ప్రచారం
- ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులకు సీఎం ఆదేశం
- రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలని సూచన
- నిత్యావసర ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపే పూర్తి చేయాలని సూచన
- కోర్టు సమస్యలున్న 23 మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలు నిర్వహించేలా చర్యలు



పెన్ పవర్ డెస్క్: జలాశయాల్లో నీళ్లున్నా పంట లకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. వాటిని సమర్థంగా తిప్పికొట్టడంతోపాటు ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులను ఆదేశించారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం మంత్రులతో సీఎం మాట్లాడారు. తాము చేసిన ప్రారంభోత్సవాలను వారి ఘనతగా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ప్రచారాలు చేయడంలో వైకాపా ముందుంటుందన్నారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి మంచీ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి అన్ని వాస్తవాలు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను సీఎం అభినందించారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించేందుకు అందరినీ భాగస్వాముల్ని చేద్దామన్నారు. నిత్యావసర ధరలు పెరగకుండా చూడాలని మంత్రులకు సీఎం సూచించారు. రైతు బజార్లలో బియ్యం తక్కువ ధరకు ఇస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల తెలిపారు. మిగిలిన వాటి ధరల నియంత్రణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందేలా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాల్లో జఠిల సమస్యల పరిష్కారానికి వారిదే బాధ్యతని చెప్పారు. నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న 6 వేల ఎకరాలకు పట్టాలు లేవని, రెండు నెలల్లో సమస్య పరిష్కారించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూములు ఎక్కడున్నాయో

గుర్తించి పట్టాలివ్వాలన్నారు. సూర్యఘర్ వినియోగంలో 4వ స్థానంలో ఉన్న ఏపీ మొదటి స్థానానికి రావాలన్నారు. 20 లక్షల కనెక్షన్లయినా వాడుకోవాలన్నారు.

స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తి చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. వచ్చే ఏడాదికి ఏ ఎన్నికా మిగలకుండా కోర్టు సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులున్న 23 మున్సిపాలిటీలతో పాటు మిగిలిన 100 చోట్ల కూడా ఎన్నికలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్
- స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి
- ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను


- మిగతా 2లో



## వివేకా హత్య కేసులో ఈడీ ఎంట్రీ: రూ. 40 కోట్ల డీల్‌పై అప్రూవర్ దస్తగిరి విచారణ

- దర్యాప్తును వేగవంతం చేసిన ఈడీ
- గంగిరెడ్డి, శివశంకర్ రెడ్డి తదితరుల మధ్య రూ.40 కోట్ల డీల్ జరిగినట్టు ఆరోపణలు
- వివేకాను హత్య చేసేందుకు రూ. 5 కోట్ల ఒప్పందం చేసుకున్నట్టు దస్తగిరి వాంగ్మూలం

- మిగతా 2లో




## 2027 వరకు ఎల్‌నినో..

### డబ్ల్యూఎంఓ సంచలన హెచ్చరిక.. భారత్‌కు మరో వాతావరణ ముప్పు

- 100 శాతం కొనసాగింపు అవకాశముందని డబ్ల్యూఎంఓ అంచనా
- 2026 చివరికి తీవ్ర స్థాయికి చేరే అవకాశం
- పసిఫిక్ సముద్రంలో అసాధారణ వేడి
- భారత్‌లో ఇప్పటికే 16 శాతం వర్షపాతం లోటు
- దేశంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం
- వ్యవసాయం, నీటి వనరులపై ఒత్తిడి ముప్పు

- మిగతా 2లో

## రూ.5 కోట్లకు రేప్ కేసుల సెటిల్‌మెంట్?

### పంజాబ్ సీఎంపై బీజేపీ సంచలన ఆరోపణలు



- భగవంత్ మాన్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు
- రూ.5 కోట్లకు రేప్ కేసులు సెటిల్ చేస్తున్నారని ఆరోపణ
- ఆడియో క్లిప్‌లను విడుదల చేసిన బీజేపీ
- ఆడియోలో లేని మాన్, ఆయన భార్య పేర్లు
- గుర్విందర్ సింగ్ చాహల్ కేసుతో ముడిపడ్డ కేసు

పెన్ పవర్ డెస్క్:పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. ముఖ్య మంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గురుప్రీత్ కౌర్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది.

- మిగతా 2లో

## హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం..

### 'గంజా క్వీన్' నీతూ బాయిపై ఈడీ రైడ్స్

- హైదరాబాద్ గంజాయి కింగ్‌పిన్ నీతూ బాయిపై ఈడీ దాడులు
- మనీలాండరింగ్ ఆరోపణలపై 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- ఈగల్, ఎక్సైజ్ శాఖ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ కేసు నమోదు
- గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బు, ఆస్తులపై లోతైన దర్యాప్తు
- కుటుంబ సభ్యుల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసినట్టు అనుమానాలు

- మిగతా 2లో





## జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

- యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ
- భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ
- బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ
- శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు

- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్–ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి

# అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

- మొదటి పేజీ తరువాయి
ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

## ఎడిటర్ వ్యూ

### టీడీపీ అడ్డా..ప్రత్యర్థి ఎవరైనా.. పసుపు జెండా రెపరెపరేలేనా?

తెలుగుదేశం పార్టీ పర్చూరు నియోజకవర్గంలో తిరుగులేని విధంగా ఉంది. అక్కడ టీడీపీకి పోటీ ఇచ్చే పార్టీ లేకుండా పోయింది. పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ ఓటు బ్యాంకు పటిష్టంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. దగ్గుబాటి వెంకటేశ్వర రావు సొంత నియోజకవర్గమైన పర్చూరు తొలి నుంచి టీడీపీకి పట్టు ఉంది. టీడీపీ ఆవిర్భావం నుంచి పర్చూరు టీడీపీ ఖాతలో పడుతుంది. అయితే దగ్గుబాటి వెంకటేశ్వర రావుకు కుటుంబానికి పర్చూరు నియోజకవర్గంతో ఉన్న అనుబంధం కారణంగా ఆయన టీడీపీ, కాంగ్రెస్ నుంచి పోటీ చేసినా గెలిచారు. కానీ 2019లో మాత్రం ఆయన వైసీపీ నుంచి పోటీ చేసి దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ లో ఆదరించినా, వైసీపీలో మాత్రం దగ్గుబాటిని పర్చూరు దగ్గరకు తీసుకోలేదు.

**దగ్గుబాటికీ తప్పని ఓటమి...**

దీంతో దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాజకీయాల నుంచే నిష్క్రమించాల్సి వచ్చింది. 1983 నుంచి మొన్నటి ఎన్నికల వరకూ పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ ఏడు సార్లు విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ నాలుగు సార్లు గెలిచింది. అయితే వైసీపీ ఇంత వరకూ గెలుపు అక్కడ చూడలేదు. అక్కడ సామాజికవర్గాల పరంగా చూసుకున్నా టీడీపీకి ఓటు బ్యాంకు ఎక్కువగానే కనిపిస్తుంది. తొలి నుంచి ఉమ్మడి ప్రకాశ్రంలోనూ, ఇప్పటి బాపట్ల జిల్లాలో ఉన్న పర్చూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉంది . ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయాలను సాధించారు. పర్చూరు నియోజకవర్గంలో గుంటూరు ఛానల్ పొడిగింపు వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతరం కృషి చేస్తున్నారు. అందుకే టీడీపీకి వెన్నుదదన్నుగా పర్చూరు నియోజకవర్గం నిలుస్తుంది. అక్కడ పోటీ చేసేందుకు సరైన నాయకుడు లేకపోవడం కూడా ప్రత్యర్థి పార్టీలకు మైనస్ అని చెప్పాలి.

**నేతలను మార్చినా...**

అభివృద్ధి పనులపై ప్రతిపక్ష వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందని టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు. ఛానల్ పొడిగింపు కోసం స్థానికంగా రిలే దీక్షలు కూడా చేపట్టారు.ఇటీవల మండల స్థాయిలో కొత్త అధ్యక్ష, కార్యవర్గాలను ఎన్నుకుంటూ పార్టీని మరింత పటిష్టం చేస్తున్నారు. ఇకవైసీపీ ఇక్కడ నేతలను మార్చి మార్చి బరిలోకి దింపుతున్నా ప్రయోజనం లేకపోతుంది. 2014 నుంచి 2024 ఎన్నికల వరకూ గొట్టిపాటి భరత్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, యడం బాలాజీని పోటీకి దింపారు. అయినా ఫలితం లేదు. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత ఆమంచి కృష్ణమోహన్ ను పర్చూరు నియోజకవర్గం ఇన్ ఛార్జిగా నియమించారు. ఆమంచి తర్వాత వైసీపీని వీడి వెళ్లిపోయారు. ప్రస్తుతం గాదె మధుసూదన్ రెడ్డిని పర్చూరు వైసీపీ ఇన్ ఛార్జిగా నియమించారు. అయినా టీడీపీ గెలుపును అడ్డుకోవడం ఇక్కడ కష్టమే.

## 2027 వరకు ఎల్‌నినో.. డబ్ల్యూఎంఓ సంచలన హెచ్చరిక.. భారత్‌కు మరో వాతావరణ ముప్పు

వాతావరణ మార్పులపై 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కీలక హెచ్చరిక చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది చాలా తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని తాజా అంచనాలో వెల్లడించింది.

సెప్టెంబర్ 3న విడుదల చేసిన తాజా నివేదికలో డబ్ల్యూఎంవో ఇంతటి అధిక స్థాయి విశ్వాసంతో ఎల్‌నినో కొనసాగింపుపై అంచనా వేయడం ఇదే తొలిసారి. పసిఫిక్ సముద్ర ఉపరితలంతో పాటు లోతైన జలాల్లోనూ అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి ఎల్‌నినో మరింత బలపడేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి.

**పసిఫిక్‌లో అసాధారణ వేడి**

ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియ. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును మార్చగలదు.ఎల్‌నినోను పర్యవేక్షించే కీలక ప్రాంతమైన నినో 3.4లో మే నుంచి జులై 2026 వరకు సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. జులైలో ఈ తేడా 2 డిగ్రీలకు చేరింది. జులై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు వారపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.2 నుంచి 2.6 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదయ్యాయి.సముద్రం అడుగుభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. జులై, ఆగస్టు ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 2026 చివరి నాటికి ఎల్‌నినో చాలా బలమైన స్థాయికి చేరుకోవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది.

**భారత్‌పై ఎలాంటి ప్రభావం?**

ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. అయితే భారత్‌కు ఇది కీలకమైన వాతావరణ సంకేతం. సాధారణంగా ఎల్‌నినో బలపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడొచ్చు.భారత్‌లో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆందోళనకర అంచనా ఇచ్చింది. మేలో విడుదల చేసిన అంచనాలో సీజన్ మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా అంచనా వేసింది.

ఆ అంచనాలకు అనుగుణంగానే ఆగస్టు ముగిసే నాటికి దేశంలో వర్షపాతం 16 శాతం లోటుగా నమోదైంది.

**వేడి, కరవు.. కొన్ని చోట్ల భారీ వర్షాలు!**

ఎల్‌నినో బలపడటంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, కరవు, వరదల ముప్పు పెరగొచ్చని డబ్ల్యూఎంఓ హెచ్చరిస్తోంది. సెప్టెంబర్–నవంబర్ మధ్య దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అయితే వర్షపాతం మాత్రం ప్రాంతాన్ని బట్టి మారుతుందని తెలిపింది.

భారత్‌పై ఎల్‌నినో ప్రభావాన్ని ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీంతో ఎల్‌నినో వల్ల భారత్‌లో సాధారణంగా కనిపించే ప్రభావాల్లో కొంత మార్పు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.

**వ్యవసాయం నుంచి నీటి వనరుల వరకు..**

ఎల్‌నినో 2027 ప్రారంభం వరకు కొనసాగితే దాని ప్రభావం ఒక్క సీజన్‌కే పరిమితం కాకపోవచ్చు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, నీటి వనరుల వంటి వాతావరణంపై ఆధారపడే రంగాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.అందుకే ప్రభుత్వాలు, వాతావరణ సంస్థలు ముందస్తు హెచ్చరికలు, విపత్తు సన్నద్ధత చర్యలను మరింత బలోపేతం చేయాలని డబ్ల్యూఎంఓ సూచిస్తోంది.ఎల్‌నినో సహజమైన వాతావరణ చక్రంలో భాగమే. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న సమయంలో ఇది మరింత ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరిక స్పష్టం చేస్తోంది.

## పాలన పక్కనపెట్టి ఈవెంట్ మేనేజ్‌మెంట్

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో పాలనను పూర్తిగా పక్కనపెట్టి కేవలం ప్రచార ఆర్భాటాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తోనే ముఖ్యమంత్రి కాలం వెళ్లదీస్తున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఇంకా ఏమాత్రం పూర్తి కాకపోయినా, అన్నీ పూర్తయినట్లు చిత్రీకరిస్తూ ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమర్నాథ్ మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించడానికి కూటమి ప్రభుత్వం అంగీకరించడం ద్వారా రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసులను దారుణంగా వంచించిందని విమర్శించారు. సహజసిద్ధంగా గ్రావిటీ ద్వారా రావలసిన నీటిని పంపింగ్ సిస్టమ్ ద్వారా తెచ్చి, ఏదో గొప్ప ఘనత సాధించినట్లు ప్రచారం చేసుకోవడం కూటమి ప్రభుత్వ డ్రామాలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. పోలవరం కాలువల నిర్మాణంలో చంద్రబాబు నాయుడి పాత్ర ఏమీ లేదని...

దివంగత వైఎస్సార్, వైసీపీ అధినేత జగన్ హయాంలోనే మెజారిటీ పనులు పూర్తయ్యాయని చెప్పారు.

గతంలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించినట్లే... చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును తన స్వార్థ రాజకీయాలు, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం ఒక 'ఏటీఎం'లా వాడుకుంటున్నారని అమర్నాథ్ తీవ్ర ఆరోపణలు చేశారు. నిజమైన ప్రాజెక్టు నిర్మాణాన్ని గాలికి వదిలేసి, సొంత అనుకూల వర్గాలకు పనులు కట్టబెడుతూ, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్రలో విద్యా, వైద్య రంగాల పురోగతికి జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే పునాదులు పడ్డాయని గుర్తుచేసిన ఆయన, కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచార ఆర్భాటాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

## వివేకా హత్య కేసులో ఈడీ ఎంట్రీ: రూ. 40 కోట్ల డీల్‌పై అప్రూవర్ దస్తగిరి విచారణ

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీవ్రతరం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి మధ్య జరిగిన భారీ ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారిస్తున్నారు. వివేకా హత్య వెనుక ఆర్థిక మూలాలను, మనీ లాండరింగ్ కోణాన్ని వెలికితీసేందుకు ఈడీ ఈ దర్యాప్తును వేగవంతం చేసింది.హత్య వెనుక ఎర్ర గంగిరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలతో పాటు మరికొందరి మధ్య రూ. 40 కోట్ల డీల్ జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై ఈడీ అధికారులు దస్తగిరిని ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత అనుమానాస్పదంగా జరిగిన బ్యాంకు లావాదేవీల చిట్టాను బయటకు తీస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు దస్తగిరి తన బ్యాంకు ఖాతాల స్టేట్‌మెంట్లతో విచారణకు

హాజరయ్యారు.గతంలో సీబీఐ విచారణ సందర్భంగా... వివేకాను హత్య చేసేందుకు తనకు రూ. 5 కోట్లు ఇస్తామని ఒప్పందం చేసుకున్నట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారు. నాటి సీబీఐ స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని, ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరి ఖాతాల్లోకి బదిలీ అయిందనే విషయాలపై ఈడీ ఆరా తీస్తోంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద చేపడుతున్న ఈ విచారణతో వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సూత్రధారుల చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది.

## మోదీని అడిగే దమ్ముందా?..

తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు.

తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.

గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు.

తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు

ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

## జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

- మొదటి పేజీ తరువాయి
ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు.నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు.జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు.ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది.భారత్–ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు.జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్..రూ.3.54 కోట్ల ఆస్తులు గుర్తింపు

- మొదటి పేజీ తరువాయి
కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులకు సంబంధించిన 7 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.సోదాల్లో 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, 5 రెసిడెన్షియల్ ప్రాపర్టీలు, 8 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు రూ. 4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ. 13 లక్షల బ్యాలెన్స్, 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.ఇంకా ఇంట్లో సుమారు రూ. 11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. బ్యాంకులో 66 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ. 49 లక్షల గోల్డ్ లోన్ తీసుకున్నట్లు కూడా ఏసీబీ అధికారులు

గుర్తించారు.ఏసీబీ లెక్కల ప్రకారం సోమయ్య ఆస్తుల విలువ రూ. 3,54,36,490గా తేలింది. అయితే బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ మరింత ఎక్కువగా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆస్తులకు సంబంధించిన లావాదేవీలపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం సోమయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు వైయస్ఆర్‌సీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

తాడేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎదుర్కొనేందుకు వైయస్ఆర్‌సీపీ శ్రేణులు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని వైయస్ఆర్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు లభించిన అదనపు పది రోజుల గడువును పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, పెండింగ్ అంశాలను పరిష్కరించుకోవాలని సూచించారు. పార్టీ ఐడీ కార్డుల పంపిణీని కార్యకర్తలను మరింత క్రియాశీలం చేసే కార్యక్రమంగా నిర్వహిస్తూ, జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు సమావేశాలు, 'వెన్నుపోటు పార్టీ––వెన్నుపోటు పాలన' ప్రచారాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ఎన్నికల సన్నద్ధత మాటల్లో కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించేలా పటిష్టమైన క్యాలెండర్, సమయపట్టికతో కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంపీ/పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్యే/నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్లమెంట్ పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, పార్టీ ఐడీ కార్డుల పంపిణీ, 'వెన్నుపోటు పార్టీ–– వెన్నుపోటు పాలన' ప్రచారం తదితర అంశాలపై సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

## హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం.. 'గంజా క్వీన్' నీతూ బాయిపై ఈడీ రైడ్స్

గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కీలక నిందితురాలిగా ఉన్న నీతూ బాయి అలియాస్ 'గంజా క్వీన్'కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. నీతూ బాయి, ఆమె అనుచరులతో సంబంధం ఉన్న నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడులు నగరంలో కలకలం రేపాయి.తెలంగాణ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గతంలో నీతూ బాయి, ఆమె ముఠాపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ విచారణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 'నశా ముక్త భారత్' ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల కేసులపై కేంద్ర ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన పలు కేసుల్లో నీతూ బాయి పరారీలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి.ఈగల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసిన ఈడీ, గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం, దానిని ఎలా మళ్లించారనే దానిపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను హవాలా మార్గాల్లో తరలించినట్లు ఈడీ బలంగా అనుమానిస్తోంది. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.ఈ సోదాల్లో భాగంగా అక్రమ ఆర్జనలకు సంబంధించిన ఆధారాలు, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గంజాయి వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబ సభ్యులు లేదా బినామీల పేర్లతో స్థిరాస్తులు, ఇతర ఆస్తులలో పెట్టుబడిగా పెట్టారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు.నానక్‌రామ్‌గూడలోని లోధా బస్తీలో ఉన్న నీతూ బాయి నివాసం, గంజాయి రిటైల్ అమ్మకాలకు అడ్డాగా మారిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త మున్నా సింగ్, కుమారులు గౌతమ్, గోవింద్, కుమార్తె ఈ వ్యాపారంలో పాలుపంచుకుంటూ గంజాయి ప్యాకింగ్, అమ్మకాలలో సహాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈగల్ అధికారులు జరిపిన దాడుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో సహా పలువురు బానిసలు ఆమె ఇంటి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు.అయితే, పలు కేసుల్లో నిందితురాలిగా ఉన్నప్పటికీ నీతూ బాయి అధికారులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతోంది. 2024లో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ఆమె నివాసంపై దాడి చేసి 20 కిలోల గంజాయి, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. సోదాలు ముగిసిన తర్వాత ఈ దర్యాప్తునకు సంబంధించిన పూర్తి వివరాలను ఈడీ వెల్లడించే అవకాశం ఉంది.

## రూ.5 కోట్లకు రేప్ కేసుల సెటిల్‌మెంట్?

- మొదటి పేజీ తరువాయి
మధ్యవర్తుల ద్వారా అత్యాచారం కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ గురువారం మీడియా సమావేశంలో ఈ ఆరోపణలు చేశారు.

ఈ సందర్భంగా కొన్ని ఆడియో క్లిప్‌లను కూడా భండారీ విడుదల చేశారు. అందులో ఓ వ్యక్తి తన రాజకీయ పలుకుబడిని ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను పరిష్కరించగలమన్నట్లు మాట్లాడుతున్నారని బీజేపీ తెలిపింది. అయితే ఈ ఆడియోలో భగవంత్ మాన్, గురుప్రీత్ కౌర్ పేర్లు ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. ఆ క్లిప్‌ల ఆధారంగానే సీఎం పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని బీజేపీ పేర్కొంది.ఈ వ్యవహారం ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ గుర్విందర్ సింగ్ చాహల్ కేసుతో ముడిపడి ఉంది. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారనే ఆరోపణలపై చాహల్‌ను పంజాబ్ పోలీసులు కొన్ని నెలల క్రితం అరెస్టు చేశారు. అయితే ఈ వారం ప్రారంభంలో ఆయన్ను పోలీసులు విడుదల చేశారు. దీనిపై కూడా రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి."భగవంత్ మాన్, ఆయన భార్య మధ్యవర్తుల ద్వారా డబ్బులు వసూలు చేస్తూ కేసులను సెటిల్ చేస్తున్నారని" భండారీ ఆరోపించారు. రూ.5 కోట్లకు అత్యాచారం కేసులను పరిష్కరిస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రి నివాసం నుంచే ఇలాంటి వ్యవహారాలు నడుస్తున్నాయా? అని బీజేపీ ప్రశ్నించింది. ఈ ఆరోపణలపై పంజాబ్ ప్రభుత్వం, భగవంత్ మాన్ నుంచి తక్షణ స్పందన వెలువడినట్లు సమాచారం లేదు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసింది.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి। చిత్తూరు। వై.ఎస్.ఆర్. కడప

## మానవత్వంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్న భూలక్ష్మి సేవా సమితి



**నాయుడుపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 3**
సాటి మనిషికి సాయం చేయడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, మానవత్వంతో పేదల అవసరాలు తీర్చడం కొందరి గుణం, అదే బాటలో నాయుడుపేట మండల పరిసరాల్లో గత కొన్ని నెలలుగా భూలక్ష్మి సేవా సమితి ఆపన్న హస్తం అందిస్తూ గిరిజనుల అవసరాలను ఆదుకుంటూ సేవా కార్యక్రమాలను చేపడుతోంది. గురువారం ఆ సంస్థ ప్రతినిధిగా టిడిపి లీగల్ సెల్ అడ్వకేట్ పనబాక గంగరాజు శ్రీనివాసపురం, బట్టి విడత గిరిజన కాలనీలో ఒంటి పో లయ్య, సుబ్బ రత్నమ్మ కుమార్తె వివాహానికి అవసరమైన బియ్యం కూరగాయలు, సరుకులు అందజేశారు. ఆ కాలనీలో ఎవరైనా మృతి చెందిన, వివాహాది శుభ కార్యాలయం వారికి అవసరమైన ఆర్థిక సాయం కూడా అందిస్తూ అండగా నిలవడంతో సంస్థ నిర్వాహకులను గిరిజనులు అభినందనలు తెలియజేస్తున్నాను.

## టీడీపీ కార్యకర్త మునిరెడ్డి మృతికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఘన నివాళి

### కష్టకాలంలో మునిరెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది ఎమ్మెల్యే బొజ్జల

**ఏర్పేడు, పెన్ పవర్ ,సెప్టెంబర్ 03:**
ఏర్పేడు మండలంలోని కందాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ క్రియాశీల కార్యకర్త జిపాలెం మునిరెడ్డి పార్థివదేహానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఘనంగా నివాళు లర్పించారు. మునిరెడ్డి మృతితో పార్టీ ఒక నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోయిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.మునిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన మునిరెడ్డి సేవలను ఎప్పటికీ మరువలేమని, ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, టీడీపీ నాయకులు,



కార్యకర్తలు మునిరెడ్డికి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మునిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## పేద వధువులకు మంగళసూత్రాల అందజేత

**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,03:**
ఆర్థికంగా వెనుకబడిన అర్చక, పురోహిత కుటుంబాలకు చెందిన ఇద్దరు పేద వధువులకు శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళసూత్రాలు, పసుపు, కుంకుమ, చీర, సారెకు నగదు అందజేశారు. తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాళెంలోని శ్రీ పట్టాభిరామాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ప్రవాస భారతీయులు, సంస్థ వ్యవస్థాపకులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో ఒక్కో వధువుకు రూ.50 వేల చొప్పున మొత్తం రూ.లక్ష విలువైన సామగ్రి, నగదును ఆలయ ధర్మకర్త, సొసైటీ మాజీ చైర్మన్ కొడవలూరు దామోదరరెడ్డి ఆన్‌లైన్ ద్వారా అందించారు.ఈ సందర్భంగా దామోదరరెడ్డి మాట్లాడుతూ పేద అర్చక, పురోహిత కుటుంబాలకు చెందిన వధువుల వివాహాలకు అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. దాతలను



ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో శ్రీరామసేన అధ్యక్షులు హరీష్‌రెడ్డి, వంశీ, దినేష్, హరీష్, ఆలయ ప్రధాన




అర్చకులు, సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## కరువు జిల్లాలను గుర్తించి రైతాంగాన్ని ఆదుకోవాలి

### - ఎల్నినో ప్రభావంతో 25 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు నిలిచిపోయింది: కంకణాల ఆంజనేయులు

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ , సెప్టెంబర్ 03:**
ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే కరువు జిల్లాలను గుర్తించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు.శ్రీకాళహస్తిలోని సుందరయ్య భవన్‌లో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు నలుగూరి రమణయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎల్నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రబీ సీజన్‌పై కూడా ఆశాజనక పరిస్థితులు కనిపించడం లేదన్నారు.వ్యవసాయ పనులు లేక కూలీలు వలస బాట పడుతున్నారని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం తక్షణమే కరువు బృందాలను పంపి పరిస్థితులను అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ కూలీలకు రెండు నెలల పాటు రూ.10 వేల కరువు భత్యం, నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరించాలని




కోరారు.కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో అనేక హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదని ఆంజనేయులు విమర్శించారు. ముఖ్యంగా ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. పింఛన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి అన్ని సూపర్ సిక్స్ పథకాలు అమలయ్యాయని ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు.ఇక జిల్లాలో దళితులు, గిరిజనుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. సత్యవేడు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, పుత్తూరు ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. వెత్తలతడుకు, కుక్కంబాకం, కలపాడు, పెట్లూరు, గొట్టికాడు, గోపాలకృష్ణాపురం తదితర గ్రామాల్లో దళితులు, గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు.పేదలకు పట్టాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్న ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు మాత్రం వేగంగా భూసేకరణ చేసి భూములు కేటాయిస్తోందని ఆయన ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాజగోపాల్, వరలక్ష్మి, కృష్ణయ్య, ఎల్లయ్య, శంకరయ్య, తిరుపాలు, మునిశంకర్, వెంకటగిరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేనాని జన్మదినం.. శ్రీకాళహస్తిలో సేవా కార్యక్రమాల జోరు

### - దండి నరేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**శ్రీకాళహస్తి , పెన్ పవర్, సెప్టెంబర్ 03:**
జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన నాయకులు, జనసైనికులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ నాయకుడు దండి నరేంద్ర ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్‌లో సుమారు 200 యూనిట్ల రక్తదానంతో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ఆలయంలో పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలు, మానసిక ప్రశాంతత, దృఢమైన నాయకత్వం కోసం ప్రత్యేక రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు.
ముచ్చివోలు నుంచి రేణిగుంట వరకు సుమారు 200 బైకులతో 78 కిలోమీటర్ల భారీ బైక్ ర్యాలీ నిర్వహించి జనసేన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి జనసైనికులతో కలిసి 'జై కొట్టు' కార్యక్రమాన్ని వీక్షించారు.అనాథాశ్రమంలో సుమారు 70 మందికి అన్నదానం, కందాడు పంచాయతీ పరిధిలో మొక్కలు నాటడం, శ్రీకాళహస్తి పట్టణంలో సుమారు 500 మందికి అన్నదానం, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.అదేవిధంగా రేణిగుంట, కందాడు, బి.పి. అగ్రహారం, ముచ్చివోలు, అమందూరు, మద్దిలేడు,










వాగవేడు, సూరవారిపల్లె, విప్పమనపట్టెడ తదితర ప్రాంతాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించగా, కరకంబాడిలో జనసేన జెండాను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా దండి నరేంద్ర మాట్లాడుతూ "జనసైనికుల ప్రేమే నా బలం.. వారి నమ్మకమే నా బాధ్యత" అని అన్నారు. తనపై జనసేన నాయకులు, జనసైనికులు, నియోజకవర్గ ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి జనసైనికుడికి, పార్టీ నాయకులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.జనసేనాని పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు ఆయురారోగ్యాలు, శక్తి, ప్రశాంతత, మరింత బలమైన నాయకత్వాన్ని ప్రసాదించాలని శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు దండి నరేంద్ర తెలిపారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.. సేవా కార్యక్రమాలతో పేట బ్రదర్స్ మిత్రబృందం స్ఫూర్తిదాయక సంబరాలు

### – నిలువెత్తు నిదర్శనం ప్రేమకు.. అభిమానానికి.. గౌరవానికి.. నిజాయితీకి ప్రతీక పవన్ కళ్యాణ్ : పేట బ్రదర్స్ మిత్రబృందం





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 03:**
జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పేట బ్రదర్స్ మిత్రబృందం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు వివిధ సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు, నిరుపేద గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శ్రీమతి డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన కుటుంబానికి శాశ్వత జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో ప్రత్యేకంగా దుకాణాన్ని ఏర్పాటు చేసి, వ్యాపారం ప్రారంభించేందుకు సహకరించారు. అలాగే నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా పేట బ్రదర్స్ మిత్రబృందం నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సంవత్సరంలోని 365 రోజుల్లో ఒక రోజు వేలాది మంది రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారడం, లక్షలాది మందికి అన్నదానం చేయడం, వేల సంఖ్యలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం వంటి స్ఫూర్తిదాయక కార్యక్రమాలు పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా చోటుచేసుకుంటున్నాయని అన్నారు.పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వం, నిజాయితీ, ధైర్యం, తెగింపు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్రను తిరగరాయాలంటే ఎన్ని యుగాలు పడుతాయో ఊహించలేమని అభిమానులు, నాయకులు పేర్కొన్నారు.ఈ ఐదు రోజుల సేవా కార్యక్రమాల్లో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు, సేవా దృక్పథం కలిగిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల ముందస్తు ప్రక్రియలో గ్రామసభలు

### - చిట్టతూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితాకు ఆమోదం





**తొట్టంబేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 03:**
ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఎన్నికల ముందస్తు ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు గ్రామాల్లో ఓటర్లకు అవగాహన సదస్సులు, గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొట్టంబేడు మండలంలోని చిట్టతూరు గ్రామంలో గ్రామ సచివాలయ అధికారి కె. శాంతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తొట్టంబేడు డిప్యూటీ ఎంపీడీఓ జి. భార్గవ్ సత్యం హాజరై ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ముసాయిదా జాబితా ఆమోద ప్రక్రియను ప్రారంభించారు. గ్రామసభలో సచివాలయ అధికారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లలో అర్హులుగా గుర్తించిన వారి వివరాలను గ్రామస్తులకు చదివి వినిపించి, వారి ఆమోదాన్ని పొందారు.ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ జి. భార్గవ్ సత్యం మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ ఎన్నికల ముందస్తు ప్రక్రియలో కీలకమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు సర్వేలో వచ్చిన అభ్యంతరాలపై గత నెల 29న ప్రారంభమైన క్షేత్రస్థాయి విచారణ బుధవారంతో ముగుస్తుందని తెలిపారు. ముసాయిదా జాబితాలో పేర్ల మార్పు కోసం ఫారం–2, పేర్లను చేర్చేందుకు ఫారం–3, అభ్యంతరాలు లేదా తమకు తెలియకుండా చేర్చిన పేర్లను తొలగించేందుకు ఫారం–4 ద్వారా ఓటర్లు దరఖాస్తులు అందజేశారని చెప్పారు.ఎంపీడీఓల పర్యవేక్షణలో దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తయిన అనంతరం సెప్టెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి అర్హులుగా గుర్తించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల వివరాలను సభల్లో చదివి వినిపించి ఆమోదం పొందుతామని తెలిపారు. సెప్టెంబర్ 7వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ జి. భార్గవ్ సత్యం వెల్లడించారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు..

## శ్రీకాళహస్తిలో ఆరు ప్రాంతాల్లో జనసేన జెండా ఆవిష్కరణ

### కొట్టే సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణలు..

### ఉత్సాహంగా పాల్గొన్న వందలాది జనసైనికులు







**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 03:**
జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎం.ఎం.వాడ సర్కిల్, బహదూర్ పేట సర్కిల్, శ్రీకాళహస్తి మండలంలోని చెర్లోపల్లె సర్కిల్, సుబ్బానాయుడు కండ్రిగ అరుంధతివాడ సర్కిల్, తొట్టంబేడు మండలంలోని పూడి అరుంధతివాడ సర్కిల్, రేణిగుంట మండలంలోని కరకంబాడి సర్కిల్‌లలో జనసేన జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో వందలాది మంది జనసైనికులు, పార్టీ అభిమానులు ఉత్సాహంగా పాల్గొని పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జనసేన శ్రేణుల సందడి నెలకొంది.

# విద్యార్థుల్లో ఆధ్యాత్మిక విలువలకు సత్యసాయి పద్య సూక్తుల పోటీలు





**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబరు 03:**
భగవాన్ సత్యసాయిబాబా అనుగ్రహంతో విద్యార్థుల్లో నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే లక్ష్యంతో శ్రీరామ్ నగర్ కాలనీ సమితి, సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పేడు మండలంలోని రెండు పాఠశాలల్లో సత్యసాయి పద్య సూక్తుల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఒడ్డిమిట్ట మోడల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో కే. యశ్వంత్ ప్రథమ, సీ. వర్షిత ద్వితీయ, పీ. మౌలిక్ తృతీయ బహుమతులు సాధించారు. అదేవిధంగా మోదుగులపాలెం మోడల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పోటీల్లో ఎం. తేజశ్రీ ప్రథమ, టీ. పూర్విక ద్వితీయ, జీ. జాన్ మైకేల్ తృతీయ బహుమతులు పొందారు. పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరినీ నిర్వాహకులు అభినందించారు. విద్యార్థుల్లో మంచి ఆలోచనలు, సత్ప్రవర్తన, మానవతా విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## పాఠశాలలో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు




**ప్యాపిలి,(పెన్ పవర్):**
స్థానిక కిందిగేరి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణం చిన్నారుల కేరింతలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా మారింది. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. నెమలి పింఛం ధరించి, చేతిలో పిల్లనగ్రోవితో శ్రీకృష్ణుడి వేషంలో చిన్నారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, కృష్ణుడి లీలల ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు మన దేశ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశంతో పాఠశాలలో వివిధ పండుగలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరినాథ్ రెడ్డి, లక్ష్మీ, గురువర్ధిని, వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సాలీడు చరిత్రను పాటగా వెలుగులోకి తెచ్చిన పాత్రికేయుడికి ఘన సత్కారం

### శ్రీకాళహస్తి వైభవాన్ని అక్షరాల్లోనే కాదు.. పాట రూపంలో చాటిన చెన్నూరు వెంకటేశులు

**శ్రీకాళహస్తి , పెన్ పవర్, సెప్టెంబర్ 03:**
శ్రీకాళహస్తి క్షేత్ర మహిమలో విశిష్ట స్థానం కలిగిన సాలీడు (శ్రీ) చరిత్రను పాట రూపంలో రచించి ప్రజలకు మరింత చేరువ చేసిన శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ పాత్రికేయులు చెన్నూరు వెంకటేశులును తిరుపతికి చెందిన గ్రీన్ హోమ్ డెవలపర్స్ అధినేత శ్రీ రవిచంద్ర ఘనంగా అభినందించి సత్కరించారు.



ఈ సందర్భంగా చెన్నూరు వెంకటేశులును శ్రీవారి కండువాతో సత్కరించి ఆయన రచనా ప్రతిభను ప్రశంసించారు. శ్రీకాళహస్తి క్షేత్ర చరిత్ర, ఆధ్యాత్మిక వైభవాన్ని పాట రూపంలో అందరికీ పరిచయం చేయడం అభినందనీయమని రవిచంద్ర అన్నారు. కలియుగ వైకుంఠనాథుడైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి మహిమలను కూడా పాటల రూపంలో ప్రజలకు చేరువ చేయాలని ఆయన సూచించారు. చరిత్రను కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా భావితరాలకు మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని అందించవచ్చన్నారు. సాలీడు చరిత్రను తన కలం ద్వారా పాటగా మలిచి శ్రీకాళహస్తి క్షేత్ర విశిష్టతను వెలుగులోకి తీసుకొచ్చిన చెన్నూరు వెంకటేశులును పలువురు అభినందించారు. ఈ సత్కారం ఆయన సాహిత్య, పాత్రికేయ సేవలకు లభించిన గౌరవంగా పలువురు పేర్కొన్నారు.

# రెవిన్యూ సిబ్బంది మాయాజాలం పిఓబి భూమిని దొడ్డి దారి రిజిస్ట్రేషన్

**దొరవారిసత్రం: పెన్ పవర్, సెప్టెంబర్ 3**
జాతీయ రహదారుల సమీపంలోని భూముల విలువ భారీగా పెరగడంతో అక్రమార్కులు రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రభుత్వ భూములను సైతం, సర్వే నంబర్లు మార్చిపట్టా భూములుగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. భూ కుంభకోణాల్లో రెవెన్యూ అధికారుల ప్రధాన పాత్ర ఉన్నట్లుగా విమర్శలు ఉన్నాయి.. ఇందుకు నిదర్శనంగానే దొరవారి సత్రం మండల పరిధిలోనినెలబల్లి రెవెన్యూ గ్రామంలో జాతీయ రహదారి సమీపాన, స్వర్ణ సచివాలయానికి దగ్గరగా ఉన్న 40 అంకణాల భూమిని స్థానిక వీఆర్వో, వీఆర్ఏ అండదండలతో దొడ్డిదారి రిజిస్ట్రేషన్ జరిగినట్లు సమాచారంభూ కుంభకోణం గత ఏడాది క్రితం జరిగినట్లు పలు ఆధారాల పత్రాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం స్వర్ణ సచివాలయానికి సమీపంలోనే సర్వే నంబర్ 7లో సుమారు 40 అంకణాలు 22గా నిషేధిత పి ఓ బి భూజాబితాలో ఉంది. ఆ స్థలాన్ని ఆ గ్రామానికి సంబంధం లేని ఓ వ్యక్తి సెప్టెంబర్2025న విధుల్లో ఉన్న వీఆర్వో, వీఆర్ఏ సహకారంతో ఆ నిషేధిత కాళీ భూమిని సంబంధంలేని సర్వే నంబర్ 168-2 గ్రామనతం భూమిలో ఉన్నట్లు సర్వే నంబర్ ని తారుమారు చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ కు అప్పటి వీఆర్వో ప్రొసీడింగ్స్ సర్టిఫికెట్ జారీ చేశారు. రెవెన్యూ వెబ్ ల్యాండ్ లో కూడా మీ భూమి పోర్టల్ లో 168-2 సర్వే నంబర్ చూపించారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి గ్రామనట్టం భూమికి వెసులుబాటు కల్పించడంతో స్థానికేతరుడైన ఓ వ్యక్తి వీఆర్వో ప్రొసీడింగ్ తోపాటు, మండల సర్వే స్థలం మ్యాప్ స్కెచ్ సర్టిఫికెట్ కూడా పొంది. వాటి ఆధారాలతో నిషేధిత జాబితాలో ఉన్న స్థలాన్ని నాయుడుపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో12-9-2025 రిజిస్ట్రేషన్ మరో వ్యక్తిపైచేశారని విశ్వసనీయ సమాచారం ఆ వ్యక్తులేఅదే 40 అంకణాలు స్థలాన్ని నాయుడుపేట కు చెందిన ఓ చికెన్ వ్యాపారికి సుమారు 40 లక్షలకు అమ్మి సొమ్ము చేసుకున్నట్లు పుకార్లు ఉన్నాయి. ఈ అవినీతి అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సహాయ సహకారులుగా వీఆర్వో, వీఆర్ఏ ప్రధాన పాత్ర పోషించినట్లు ఆ గ్రామ ప్రజలే విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా కాళీ స్థలం స్కెచ్ మ్యాప్ లో మండల సర్వేయర్ సంతకం నాది కాదని, ఎవరో నా సంతకాన్ని ఫోర్జరీ చేశారని వివరణ ఇస్తున్నారు. ఏది ఏమైనా రాజు తలచుకుంటేకొరడా దెబ్బలకు కొదువ లేదన్నట్లు సామెతగా, ఆశించినది చేతికి అందిస్తే ప్రభుత్వ స్థలాలు సైతం, ప్రైవేటు భూములుగా మార్చే స్థితిలో రెవెన్యూ అధికారుల పనితీరు ఏమిటన్నది ఇలాంటి సంఘటనలలో తేటతెల్లనవుతోంది. జాతీయ రహదారి సమీపంలోని నెల బల్లిలోజరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ లో మరెందరి అధికారుల హస్తం ఉందో ఉన్నత స్థాయి అధికారుల విచారణలో అసలు కారకులెవరన్నది బట్ట బయలు కానుంది. సంబంధిత జిల్లా కలెక్టర్, ఆర్డీవో గత ఏడాది జరిగిన భూ కుంభకోణంలో అసలు సూత్రధారులు ఎవరన్నది గుర్తించి తగు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలనిఆ గ్రామ ప్రజలు అంటున్నారు.

# అస్తవ్యస్థంగా ఉన్న విద్యానగర్ - గూడలి రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్





**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,03:**
కోట మండల పరిధిలోని విద్యానగర్ నుండి గూడలి వరకు అస్తవ్యస్తంగా తయారైన ప్రధాన రహదారి పనులను గూడూరు శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత క్రమంగా ఈ రహదారి తీవ్రంగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో రవాణాకు ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడి పదేపదే స్థానికులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సునీల్ కుమార్, సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు మరమ్మతు పనులను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మండలంలో దెబ్బతిన్న రోడ్లన్నింటికి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు, అధికారులు సూచించారు. రహదారి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

# పాపా నాయుడు పేట ప్రాథమిక పాఠశాలకు రూ.21 వేల విలువైన RO వాటర్ ప్లాంట్ విరాళం

### విద్యార్థుల ఆరోగ్యంపై దాతల ప్రత్యేక శ్రద్ధ.. సురక్షిత తాగునీటి సౌకర్యం

**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 03:**
పాపా నాయుడు పేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు దాత శ్రీ వంగనూరు కృష్ణప్ప మొదలి రూ.21,000 విలువైన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల వినతి మేరకు దాత ముందుకు వచ్చి ఈ సేవా కార్యక్రమాన్ని




చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి షర్మిలా దేవి దాత వంగనూరు కృష్ణప్ప మొదలికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.
ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు కావడంతో విద్యార్థినీ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటి సౌకర్యాన్ని అందించిన దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించి సేవా దృక్పథంతో ముందుకొచ్చిన దాతను పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

# అన్నదాతపై అక్రమ కేసులా? భేషరతుగా ఎత్తివేయాలి నంది రైతు సమాఖ్య

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 3**
సాగునీరు, తాగునీరు ఇవ్వాలని అడిగితే... నీరు విడుదల చేయాల్సిన ప్రభుత్వమే, అన్నం పెట్టే రైతులపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు న్యాయం? ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌ను కలవడానికి వెళ్లిన రైతులపై, వారికి మద్దతుగా నిలిచిన మాజీ ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేయడాన్ని 'నంది రైతు సమాఖ్య' అత్యంత తీవ్రంగా, కన్నీటి పర్యంతమై ఖండిస్తోంది!"రైతులు రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించలేదు, వినాశనం కోరలేదు. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి, పశువుల దాహార్తి తీర్చడానికి నీళ్లివ్వమని వేడుకోవడమే మేము చేసిన నేరమా?" అని నంది రైతు సమాఖ్య నాయకులు గళమెత్తారు. వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే గేట్లు వేసి అడ్డుకోవడం, శాంతియుతంగా రోడ్డుపై కూర్చుంటే... ఏకంగా 35 మందిపై కేసు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. కలెక్టరేట్ ఏమీ నిషేధిత ప్రాంతం కాదు, రైతులేమీ నేరస్థులు కారన్నారు. స్థానిక మంది రైతు సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షులు రామ సుబ్బారెడ్డి, జనరల్ సెక్రెటరీ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి మధుసూదన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శంకర్ నాయక్ మాజీ సర్పంచ్ కోటిరెడ్డి ఎర్రన్న మీడియా సమావేశం నిర్వహించారు. నంది రైతు సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ..శ్రీశైలంలో నీళ్లున్నా... రైతుల గుండెల్లో మంటలా?రాయలసీమ ప్రాంత ప్రాజెక్టు అయిన శ్రీశైలంలో ఏకంగా 175 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నప్పటికీ,



దిగువకు నీటిని విడుదల చేయకుండా రోజులు గడుపుతుంటే రైతాంగం ఎలా తట్టుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు లేక, సాగునీరు అందక రైతులు, ప్రజలు, పశువులు అల్లాడిపోతున్నాయన్నారు. సెప్టెంబర్ 15 నుండి ప్రారంభమయ్యే రబీ సీజన్ లో 100 రోజుల పంటలు సాగు చేసుకోవడానికి వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. నాడు కమతాల్లో చెమటోడ్చి దేశానికే అన్నం పెట్టిన రైతు... నేడు హక్కుల కోసం, ప్రాణాధారమైన నీటి కోసం రోడ్డెక్కితే వేధింపులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం? రైతులపై, వారికి అండగా నిలిచిన ప్రజాప్రతినిధులపై బనాయించిన అక్రమ కేసులను జిల్లా కలెక్టర్ మరియు ప్రభుత్వం వెంటనే, బేషరతుగా ఉపసంహరించుకోవాలని కోరారు. కక్షసాధింపు చర్యలు మాని, తక్షణమే దిగువకు సాగు, తాగునీటిని విడుదల చేసి రైతాంగాన్ని, రాయలసీమను కరువు కోరల నుండి కాపాడాలని నంది రైతు సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు!

# నంద్యాల జిల్లా ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు తక్షణ చర్యలు -సాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి నిమ్మల సానుకూల హామీ



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 3**
అమరావతి: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నంద్యాల జిల్లాలో రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని జిల్లా ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ రాష్ట్ర మంత్రివర్యులు ఎన్. ఎం. డి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి , గౌరు చరిత రెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి , గిత్త జయసూర్య ,రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు ని కలిసి, వర్షాలు సకాలంలో లేకపోవడంతో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి అవసరమైన నీటిని విడుదల చేయాలని కోరారు. రైతులు మరియు జిల్లా ప్రజల త్రాగు నీరు సమస్యపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, రైతులకు సాగునీరు అందేలా తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరగాలి "

## డీఎస్పీ చెంచుబాబు "




**దొరవారి సత్రం: పెన్ పవర్, సెప్టెంబర్ 3**

పల్లెల్లో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో మాత్రమే సాగాలని డీఎస్పీ చెంచు బాబు సూచించారు. దొరవారిసత్రం మండల పరిధిలోని 22 గ్రామపంచాయతీల్లో వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేయనున్న గణేష్ విగ్రహాల. ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని అన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ, శాంతి భద్రతలకు భంగం కలిగించే పరిస్థితులు ఏర్పడితే ఆ గ్రామ కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుందని ముందుగానే తెలియజేశారు. విద్యుత్ ప్రమాదాలు, మద్యం సేవించి అల్లరి చిల్లర చేష్టలు ఎక్కడ జరగకూడదని హెచ్చరించారు. ప్రధానంగా

వృద్ధులకు, పిల్లలకు ఆరోగ్యపరంగా శబ్ద కాలుష్యం లేకుండా, సౌండ్ సిస్టమ్స్ లు పరిమితి స్థాయిలోనే సద్వినియోగం చేసుకోవాలని, తెలియజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగానే వినాయక చవితి విగ్రహ కమిటీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సంగమేశ్వర రావు, ఎస్సై జివి నాయుడు, పలు గ్రామాల విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్వీ పురంలో 185 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ

### ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం సంతృప్తినిచ్చింది: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి





**రేణిగుంట, పెన్ పవర్, సెప్టెంబరు 03:**

రేణిగుంట మండలం ఎస్వీ పురం గ్రామంలో 185 మంది రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన బోరును కూడా ఎమ్మెల్యే ప్రారంభించి గ్రామస్తులకు తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం ఎస్వీ పురం గ్రామస్తులు తాగునీటి సమస్యను తన దృష్టికి తీసుకురాగా, వెంటనే అధికారులతో మాట్లాడి బోరు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. బోరు పనులు పూర్తయి, గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం 185 మంది రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల పాస్‌పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు ముద్రించి రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఎమ్మెల్యే విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీసుకున్న నిర్ణయంతో ఆ ఫొటోలను తొలగించి అధికారిక రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అంటే ఎలా ఉండాలో చూపించడానికి రైతులకు అందిస్తున్న నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలే నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం గ్రామ ప్రజలతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రశాంత్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలకు

# టీడీపీ నేత బొర్రు రాము కౌంటర్



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 3.**

ఎంతో ప్రాముఖ్యత కలిగిన విద్యాలయాలలో విద్యను అభ్యసించిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వ్యాఖ్యలకు స్పందించాల్సిన అవసరం లేదని మినగల్లు తెలుగుదేశం పార్టీ నాయకులు బొర్రు రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రజలకు సేవ ఏ విధంగా చేయాలో అనే విషయంపై ఆలోచన సరళి ఉంటుంది కానీ ప్రసన్న కుమార్ రెడ్డి లాంటి వారి మాటలకు ఆయన సమాధానం చెప్పడని తెలిపారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఏదైనా తప్పు చేసి ఉంటే చేసిన తప్పులు పై కేసులు పెట్టే విషయం కూడా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రసన్న కుమార్ రెడ్డికి తెలియదా అని విమర్శించారు. ప్రసన్న కుమార్ రెడ్డి వలన ఎంతమంది కుటుంబాలు రోడ్డున పడ్డాయో తెలుసా అని అలాంటి వ్యక్తి మాటలకు మా నాయకుడు సమాధానం చెప్పడని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎంతమందిపై బలవంతపు కేసులు పెట్టి వారి కుటుంబాలను భయభ్రాంతులకు చేసిన విషయం అప్పుడే మరిచిపోయావా అంటూ వ్యంగ్యాస్త్రం విసిరారు. పెనుబల్లి గ్రామంలో ఒక్కడి కోసం 17 మందిపై కేసులు పెట్టించిన నీచ సంస్కృతి ప్రసన్న కుమార్ రెడ్డిదని కుండ బద్దలు కొట్టారు. పర్సంటేజీలు తీసుకునే సంస్కృతి నీదైతే సేవ చేసే గుణం మా విపిఆర్ కుటుంబానిదని అన్నారు. ఇకపై విపిఆర్ కుటుంబ సభ్యుల మీద ఎటువంటి అసత్య పదజాలం వాడిన ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఎంఎల్ఎస్ పాయింట్‌లో జేసీ ఆకస్మిక తనిఖీ

### స్టాక్, రికార్డుల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఆదేశాలు

**నంద్యాల, ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 03**

ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన నిల్వల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నంద్యాల పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఎంఎల్ఎస్ పాయింట్‌లోని స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, రికార్డుల్లో నమోదైన నిల్వలను భౌతికంగా ఉన్న స్టాక్‌తో సరిచూశారు. స్టాక్ వివరాలు, రికార్డుల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, ఇతర రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, నిల్వల వివరాల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. డీఎంసీఎస్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఈ తనిఖీలో జేసీ వెంట పాల్గొన్నారు.



## నంద్యాలలో ఇంటర్‌జోనల్ బాక్సింగ్ పోటీలు---

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 03–:**

నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మధుమణి ఆసుపత్రి ఆడిటోరియంలో ఇంటర్‌జోనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి అమరావతి క్రీడా పోటీల్లో నంద్యాల జిల్లా బాక్సింగ్ క్రీడాకారులు ఒక బంగారు, నాలుగు రజత పతకాలు సాధించి తృతీయ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. నంద్యాలలో బాక్సింగ్ శిక్షణ శిబిరాలతో పాటు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ క్రీడాకారులు మహమ్మద్ అలీ, మేరీకోమ్ వంటి ప్రముఖులను ఆదర్శంగా తీసుకుని నిరంతర సాధనతో ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల నుంచి 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని జిల్లా కార్యదర్శి ఫయాజ్ తెలిపారు. బాల, బాలికలకు వేర్వేరు బరువు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో నూర్ భాషా, చంద్రశేఖర్, నాగేంద్ర, ఆనంద్, కోచ్‌లు, రెఫరీలు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వ మెనూ తప్పనిసరి

ఈర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో లోపాలపై కలెక్టర్ అసంతృప్తి

విధుల్లో నిర్లక్ష్యంపై శాఖాపరమైన చర్యలకు ఆదేశం

గంగవరం రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 3: పోలవరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యాబోధన, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు.

గురువారం రాత్రి రంపచోడవరం మండలం ఈర్లపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న విద్యా బోధన, ఆహార వసతి, మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలు అర్థమవుతున్నాయా, ప్రతిరోజూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందుతున్నదా, పాఠశాలలో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని, అవసరమైతే ఒకటికి రెండుసార్లు వివరించి చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆశ్రమ పాఠశాలకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు, పాలు, గుడ్లు, కోడి మాంసం, కూరగాయల నాణ్యతతో పాటు వాటి సరఫరా విధానంపై కలెక్టర్ సమగ్రంగా వివరాలు తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలపై తగిన పర్యవేక్షణ లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.




పాఠశాల హెచ్‌ఎం ఎస్. రాజేశ్వరి గైర్హాజరుపై, అలాగే డిప్యూటీ వార్డెన్ కె. అనురాధ విధుల నిర్వహణపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతపై పర్యవేక్షణలో లోపాలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారు.

అలాగే నిబంధనలు పాటించని ఆహార సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లాలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందించే విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదని కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు.

## రాజకీయ వత్తిళ్లతో మెప్మాలో మల్లగుల్లాలు!--

### సీఆర్పీల తొలగింపుపై అధికారులపై ఒత్తిళ్లు?--

### ప్రజా సమస్యల వేదికలో కలెక్టర్‌కు బాధితుల మొర--




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 03–:**

మెప్మా కార్యాలయంలో రాజకీయ వత్తిళ్ల అధికారులకు తలనొప్పిగా మారినట్లు సమాచారం. సీఆర్పీలుగా పనిచేస్తున్న కొందరిని తొలగించాలని అధికార పార్టీ నాయకుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇప్పటికే తొలగించిన సీఆర్పీలు తమకు అన్యాయం జరిగిందంటూ జిల్లా కలెక్టర్ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయిస్తున్నారు. తమను ఎలాంటి కారణాలు చూపకుండా విధుల నుంచి తొలగించారని, న్యాయం చేయాలని బాధిత సీఆర్పీలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఒకవైపు అధికార పార్టీ నాయకుల నుంచి వస్తున్న ఒత్తిళ్లు, మరోవైపు జిల్లా అధికారుల ఆదేశాలు, ఫిర్యాదులతో మెప్మా పీడీ కార్యాలయ సిబ్బంది సతమతమవుతున్నట్లు సమాచారం. సీఆర్పీల నియామకాలు, తొలగింపుల వ్యవహారం రాజకీయ రంగు పులుముకోవడంతో అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో అయోమయానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదులపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, అర్హులైన సీఆర్పీలకు అన్యాయం జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

# ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వ మెనూ తప్పనిసరి

### - ఈర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో లోపాలపై కలెక్టర్ అసంతృప్తి

### - విధుల్లో నిర్లక్ష్యంపై శాఖాపరమైన చర్యలకు ఆదేశం

గంగవరం రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 3: పోలవరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యాబోధన, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. గురువారం రాత్రి రంపచోడవరం మండలం ఈర్లపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న విద్యా బోధన, ఆహార వసతి, మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలు అర్థమవుతున్నాయా, ప్రతిరోజూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందుతున్నదా, పాఠశాలలో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని, అవసరమైతే ఒకటికి రెండుసార్లు వివరించి చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు.



ఆశ్రమ పాఠశాలకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు, పాలు, గుడ్లు, కోడి మాంసం, కూరగాయల నాణ్యతతో పాటు వాటి సరఫరా విధానంపై కలెక్టర్ సమగ్రంగా వివరాలు తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలపై తగిన పర్యవేక్షణ లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్. రాజేశ్వరి గైర్హాజరుపై, అలాగే డిప్యూటీ వార్డెన్ కె. అనురాధ విధుల నిర్వహణపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతపై పర్యవేక్షణలో లోపాలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారు. అలాగే నిబంధనలు పాటించని ఆహార సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందించే విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదని కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు.

## గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్లో అట్టహాసంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 3**

నంద్యాల జిల్లా బాబా నగర్ సమీపంలోని శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్లో పట్టాహాసంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలకు ముందుగా శ్రీకృష్ణుని విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా ఆనందోత్సవాల మధ్య సాంప్రదాయ బద్ధంగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో ఉట్టి మహోత్సవం ఆనందభరితంగా సాగింది. చిన్నారులు శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీకృష్ణ నాటకాన్ని ప్రదర్శించగా అందరిని ఆకట్టుకుంది. నాటకంలోని ప్రతి అంశం ప్రదర్శించిన సమయంలో పిల్లలు కేరింతలు కొడుతూ వీక్షించారు. అనంతరం శ్రీ గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్

### నిబంధనలు ఉల్లంఘించిన వీఆర్ఓ సస్పెన్షన్: జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్



**నంద్యాల, ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 03:–**ప్రభుత్వ భూములు, గ్రామకంఠం, పోరంబోకు భూముల విషయంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ హెచ్చరించారు. ప్యాపిలి మండలం మాధవరం గ్రామంలో గతంలో వీఆర్ఓగా పనిచేసిన మల్లారెడ్డి, సర్వే నంబర్ 507లోని గ్రామకంఠం (ప్రభుత్వ పోరంబోకు) భూమిని సరైన ఆధారాలు, సహాయక పత్రాలు లేకుండా ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసినట్లు అందిన ఫిర్యాదుపై జాయింట్ కలెక్టర్ విచారణ చేపట్టారు. విచారణలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ కావడంతో ప్రస్తుతం డోన్–1 క్లస్టర్ వీఆర్ఓగా పనిచేస్తున్న మల్లారెడ్డిని బుధవారం సస్పెండ్ చేసినట్లు జాయింట్ కలెక్టర్ నేడోక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించినా, అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# కారు ప్రమాదంలో మృతి చెందిన ఏ.ఎస్.ఐ కుటుంబానికి గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత....



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 3**

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ( ఏ.ఎస్.ఐ) విధులు నిర్వహిస్తున్న జి . సురేష్ రెడ్డి 05. జులై 2026 తేదీన జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసు శాఖలో సేవలందించిన సురేష్ రెడ్డి కుటుంబానికి పోలీసు శాఖ తరఫున గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.20,80,000/- విలువైన చెక్కు చీఫ్ ఆఫీస్ నుండి అందింది.సదరు చెక్కును నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీస్ నేడు సురేష్ రెడ్డి భార్యకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ ఎల్లప్పుడూ తన సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటుందని,పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి శాఖ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్ .ఖాదర్ భాషా, పరిపాలన విభాగం అధికారులు వీరన్న, కవిత మరియు నంద్యాల జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు స్వామినాయక్ పాల్గొన్నారు.

## ఇండ్ల వెంకట రవణమ్మ మహిళకు ఆర్థిక సాయం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 3.**

బుచ్చిరెడ్డిపాలెం మండలం దాముకుమడుగు గ్రామం గిరిజన కాలనీ వాసులు అయిన ఇండ్ల వెంకట రవణమ్మ అనే గర్భవతి మహిళకు జ్వరం వచ్చి ప్లేట్లెట్స్ 10,000 తగ్గి ఆరోగ్యం క్షీణించడంతో స్థానిక నాయకులని ఆశ్రయం కోరగా పార్టీ నాయకులు మరియు మండల పార్టీ అధ్యక్షుడు బెజవాడ జగదీష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆర్థిక సహాయాన్ని అందించి మహిళకు రక్షణ కల్పించడమే కాకుండా నేనున్నాను అని భరోసా అందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కేసీ కెనాల్ గేట్లు ఎత్తి పలు గ్రామాల తాగునీటి దాహార్తిని తీర్చిన ఎన్ఎండి ఫిరోజ్





**- మిట్నాల, పాండురంగాపురం, ఏ.శివరాంపురం, బి.శివరాంపురం గ్రామాలకు తాగునీటి విడుదల**

**- ప్రజల కష్టాలు తీర్చడమే లక్ష్యంగా చర్యలు: టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్**

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 03**

మిట్నాల, పాండురంగాపురం, ఏ.శివరాంపురం మరియు బి.శివరాంపురం గ్రామాల ప్రజల తాగునీటి అవసరాల దృష్ట్యా కేసీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి దాహార్తిని తీర్చినట్లు నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. అధికారులు మరియు స్థానిక నాయకులతో కలిసి ఆయన పోన్నాపురం కేసీ కెనాల్ గేట్లను ఎత్తి సంబంధిత గ్రామాలకు తాగునీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ మిట్నాల, పాండురంగాపురం, ఏ.శివరాంపురం మరియు బి.శివరాంపురం మరియు ఇతర గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న విషయాన్ని గుర్తించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే స్పందించి కేసీ కెనాల్ ద్వారా తాగునీటిని విడుదల చేయించడం జరిగిందని తెలిపారు . గ్రామీణ ప్రాంత ప్రజల కష్టాలను తీర్చి, ప్రతి ఇంటికీ మంచినీరు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని అన్నారు . ఈ నీటి విడుదల పట్ల మిట్నాల, పాండురంగాపురం, శివరాంపురం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఎన్ఎండి ఫిరోజ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శీలం నాగ రాజేశ్వర్ రెడ్డి, శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి ,శీలం నాగమహేశ్వర్ రెడ్డి, శీలం నాగ సుబ్బారెడ్డి, శీలం నాగ శేఖర్ రెడ్డి , శివరాం రెడ్డి, వలి, రఫీ, దూదేకుల నాగరాజు, శివ, జాన్, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్‌లో ఘనంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 3**

నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తి, సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ సుధాకర్, చైర్‌పర్సన్ రమ్యారెడ్డి, ప్రిన్సిపాల్ , పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు, యశోదమ్మ తదితర పాత్రలలో సంప్రదాయ వస్త్రధారణతో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

విద్యార్థులు శ్రీకృష్ణుని జీవిత విశేషాలను ప్రతిబింబించేలా కృష్ణుని జీవిత చరిత్ర, కోలాటం, నృత్యాలు, స్కిట్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఎంతో చక్కగా ప్రదర్శించారు. ప్రతి ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

అలాగే భగవద్గీత శ్లోకాలపై చిన్నారులకు పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ పోటీ తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రమ్యారెడ్డి మాట్లాడుతూ, ఇటువంటి పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు భగవద్గీత శ్లోకాల వంటి పోటీలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన మరియు గౌరవం పెంపొందుతాయని తెలిపారు. శ్రీకృష్ణుని జీవితంలోని వివిధ సంఘటనలను ఉదాహరణలుగా వివరిస్తూ, ఆయన బోధనలు నేటి విద్యార్థులకు కూడా ఎంతో విలువైనవని పేర్కొన్నారు.

కార్యక్రమానికి ముగింపుగా చిన్నారులైన శ్రీకృష్ణులు, గోపికలు ఉత్సాహంగా పాల్గొన్న ఉట్టి కొట్టే




వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల సందడి, ఉత్సాహంతో కార్యక్రమ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

ఆధ్యాత్మికత, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విద్యార్థుల ప్రతిభను సమన్వయం చేస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ప్రతి ఒక్కరికీ పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

## శాంతిరమ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో భక్తి, ఆనందోత్సాహాలతో కృష్ణాష్టమి వేడుకలు

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 3**

నంద్యాల: సాయంత్రం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కృష్ణాష్టమిని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల ద్వారా విద్యార్థులు, సిబ్బందిలో ప్రేమ, కరుణ, సమానత్వం, ధర్మం వంటి శాశ్వత సందేశాలు వెల్లివిరిశాయి. శ్రీకృష్ణ భగవానుడి బోధనల సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను చాటిచెప్పే సాంప్రదాయ కార్యక్రమాలతో ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వి. సుబ్రహ్మణ్యం ఈ పవిత్రమైన సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత, వృత్తి జీవితాల్లో ప్రేమ, ధర్మం, సామరస్యం, నిస్వార్థ సేవ వంటి విలువలను పాటించాలని ప్రోత్సహించారు.శ్రీమతి ఎ. రామ దేవి సమన్వయంతో కళలు, సాంస్కృతిక కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. విభాగాధిపతులు, అధ్యాపక బృందం, విద్యార్థులు ఈ వేడుకల్లో చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా, చిరస్మరణీయంగా మార్చారు.



## పేద వర్గాలకు మెరుగైన వైద్యం అందించాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా

**విజయవాడ,పెన్ పవర్,సెప్టెంబరు,3,**

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా జగ్గయ్యపేట ఏరియా ఆసుపత్రిని గురువారం ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్, ల్యాబొరేటరీ, ఓపీ విభాగం, ఆబా జనరేషన్స్, వివిధ వార్డులు, ఇతర వైద్య విభాగాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందులు, పరీక్షలు, వైద్యుల అందుబాటు తదితర అంశాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రి పనితీరులో క్యూఆర్ స్కాన్ వినియోగం తదితర అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా వైద్యులతో మాట్లాడుతూ పేద, బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్యం అందించినప్పుడే వారికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ, తగిన వైద్యం అందకపోతే పేదలు తప్పనిసరిగా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని, తద్వారా వారు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి సమర్థవంతమైన, నాణ్యమైన, మానవతా దృక్పథంతో కూడిన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. పేదలకు వైద్య సహాయం అందించడం ఎంతో గొప్ప విషయమని





కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యులుగా పేద ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోగులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని అవసరమైన వైద్య సేవలను అందించాలని తెలిపారు. వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి లోపల, బయట పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. వార్డులు, రోగుల విశ్రాంతి ప్రదేశాలు, మరుగుదొడ్లు, ఆసుపత్రి ప్రాంగణం తదితర ప్రాంతాల్లో నిరంతరం పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధులకు నిర్ణీత సమయానికి హాజరై రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా విధుల్లో సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, మందులు, వైద్య పరికరాలు తదితర ప్రయోజనాలు పేద ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.హరికృష్ణ, వివిధ విభాగాల వైద్యులు డాక్టర్ హరి, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ అరుణ, డాక్టర్ రాజకుమారి, డాక్టర్ జ్యోత్స్న, ఆర్డీఓ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ ప్రారంభోత్సవం నాటికి

# అన్ని మౌలిక వసతులతో పార్క్‌ను సిద్ధం చేయాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**విజయవాడ : పెన్ పవర్,సెప్టెంబర్ 3,**

జగ్గయ్యపేట మండలం జయంతిపురంలో ఏర్పాటు చేస్తున్న ఎం.ఎస్.ఎం.ఈ. (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల) పార్క్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు.

గురువారం జగ్గయ్యపేట జయంతిపురంలో నిర్మాణంలో ఉన్న ఎం.ఎస్.ఎం.ఈ. పార్క్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. పార్క్‌లో చేపడుతున్న వివిధ మౌలిక వసతుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎం.ఎస్.ఎం.ఈ. పార్క్‌లో నిర్మాణంలో ఉన్న అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆయా పనుల పురోగతి, నాణ్యత, పూర్తయ్యే సమయం తదితర అంశాలపై ఏపీఐఐసీ ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పార్క్ ప్రారంభోత్సవానికి ముందే అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ పార్క్ ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు, పారిశ్రామిక అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభించనుంది. పార్క్ ఆవరణలో కొన్నిచోట్ల ఉన్న పొదలు, అనవసరమైన చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పార్క్ మొత్తం ఆవరణను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగో విడత ఎం.ఎస్.ఎం.ఈ. పార్కుల ప్రారంభోత్సవాలను త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో నిర్వహించనున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మన జిల్లాలోని జగ్గయ్యపేట





ఎం.ఎస్.ఎం.ఈ. పార్క్‌ను కూడా ప్రారంభించనున్న నేపథ్యంలో, ఇప్పటికే చేపట్టిన అన్ని పనులను వేగవంతం చేసి, ప్రారంభోత్సవం నాటికి పార్క్‌ను అన్ని హంగులతో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పార్క్ నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించి, వివిధ మౌలిక వసతులు, వాటి ఏర్పాటుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జగ్గయ్యపేట ప్రాంతంలో ఎం.ఎస్.ఎం.ఈ. పార్క్ ఏర్పాటుతో స్థానికంగా పారిశ్రామిక కార్యకలాపాలు మరింత అభివృద్ధి చెందడంతో పాటు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పార్క్‌ను నిర్ణీత సమయానికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో అనిల్ కుమార్, ఏపీఐఐసీ జెడ్.ఎం. బాబ్జి, డిప్యూటీ జెడ్.ఎం.ఇంజనీర్ జి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలకు మహర్ధశ...

**తిరుపతి, సెప్టెంబర్ 3 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 5 వేల దేవాలయాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీ, దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు.రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల దేవాలయాల నిర్మాణంపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఆలయాల నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలాలు త్వరలోనే ఖరాలు చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. ఆధ్యాత్మికతను మరింత ప్రోత్సహించేలాకార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ఆలయాల నిర్మాణం, ఆధ్వర్యంలో ధార్మిక, విద్య, వైద్య సేవలపై క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు.ఆంధ్రప్రదేశ్ లో 28 జిల్లాల్లో 161 నియోజకవర్గాల నుంచి 4,192 ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందాయని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర సీఎంకు వివరించారు. 967 ఆలయాల నిర్మాణం పూర్తయిందని 3 కేటగిరీలుగా నిర్మించేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, మత్స్యకార ప్రాంతాలు, బలహీన వర్గాల కాలనీలతో పాటు సాధారణ ప్రాంతాల్లోనూ ఆలయాలు నిర్మిస్తున్నట్టు వెల్లడించారు.శ్రీవాణి ట్రస్టు ద్వారా వచ్చే నిధులను కూడా ఆలయాల నిర్మాణానికి వినియోగించాలని, శ్రీవారి సేవకుల సేవలు వినియోగించుకోవాలని, భక్తుల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. సభ్యులు, భక్తులు, శ్రీవారి సేవకులతో ఎగ్జిక్యూటివ్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లోనూ శ్రీవారి ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలన్నారు. మారిషన్ వంటి దేశాలు స్వామివారి ఆలయాలు నిర్మించాలని కోరుకుంటున్నాయి..భవిష్యత్ లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా మారేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారుకొత్త నిర్మించే ఆలయాల్లో విగ్రహాల ఏర్పాటు, అర్చకుల శిక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 1000 పాత ఆలయాలను పునరుద్ధరించాలని, శివాలయాలు, శక్తి పీఠాల అభివృద్ధిపైనా దృష్టి పెట్టాలన్నారు. అన్ని ఆలయాలకు సంబంధించిన వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు.దేవాదాయశాఖ పరిధిలో ఉన్న 28 వేల ఆలయాలు, నిర్వహిస్తున్న 65 ఆలయాలతో పాటు కొత్తగా నిర్మించే 5 వేల ఆలయాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక అవసరం అన్నారు.నిర్వహిస్తున్న అన్నదానం, శ్రీవారి సేవకుల సేవలు, ఆలయాల నిర్మాణం వంటి కార్యక్రమాలను హిందూ ధర్మ ప్రచారంతో అనుసంధానిస్తూ మరింత విస్తృతం చేయాలన్నారు ఎన్టీఆర్ ప్రారంభించిన అన్నదానం కార్యక్రమం గొప్ప సేవా కార్యక్రమంగా మారిందని చెప్పారు. ప్రాణదానం ట్రస్టు ను టీటీడీ వైద్య సేవలకు బెస్ట్ మోడల్ గా తయారు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. నిపుణులైన వైద్యుల సేవల్ని కూడా వినియోగించుకోవాలన్నారు.ఉన్న అన్ని ఆస్పత్రుల సేవల్ని అనుసంధానించాలని.. కేన్సర్ , కంటి వైద్యం సహా తిరుపతిలోని ఆయుర్వేద వైద్య సేవల్ని కూడా విస్తృతం చేయాలన్నారు. వైద్యులను శ్రీవారి సేవకులుగా మార్చి వైద్య సేవలతో పాటు బోధన కార్యక్రమాల్లోని సేవల్ని వినియోగించు కోవాలన్నారు. పరిధిలోని 33 విద్యా సంస్థల వ్యవస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు సూచించారు. విద్య, వైద్యం, సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతిలోని శ్రీవారి ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు చంద్రబాబు.తిరుమలతో పాటు తిరుపతిని కూడా సంపూర్ణ దివ్య క్షేత్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఆధ్యాత్మికత, పవిత్రత ప్రతిబింబించేలా ప్రత్యేక ఎకోసిస్టమ్ రూపొందించాలని ,నిపుణులైన భక్తుల భాగస్వామ్యంతో సేవలు మరింత విస్తృతంగా ప్రజలకు చేరేలా చూడాలన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అమలాపురంలో ఘనంగా ప్రారంభమైన శ్రీ లక్ష్మి శ్రీకర హాస్పిటల్
## కోనసీమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

డాక్టర్ పి.పి. రామారావు



పెన్ పవర్ ప్రతినిధి (అమలాపురం), సెప్టెంబర్ 03:అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో శ్రీ లక్ష్మి శ్రీకర హాస్పిటల్ ఘనంగా ప్రారంభమైంది. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అమూడ చైర్మన్ అల్లాడ స్వామి, రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, డాక్టర్ పినిపే శ్రీకాంత్తో పాటు కూటమి, వైసీపీ నాయకులు, స్థానిక ప్రముఖులు, వైద్యులు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పి.పి. రామారావు మాట్లాడుతూ.. కోనసీమ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో అమలాపురంలో శ్రీ లక్ష్మి శ్రీకర హాస్పిటల్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేసిన అనుభవాన్ని ఉపయోగించి స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.ఆసుపత్రిలో జనరల్ సర్జరీతో పాటు తల్లి, శిశు వైద్యం, పీడియాట్రిక్స్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయని డాక్టర్ రామారావు తెలిపారు. ఆధునిక వైద్య విధానాలతో నాణ్యమైన చికిత్సను అందిస్తూ కోనసీమ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ దేవి మాట్లాడుతూ.. అమలాపురంలో నూతనంగా ప్రారంభమైన ఈ ఆసుపత్రి ద్వారా స్థానిక ప్రజలకు జనరల్ సర్జరీ, పిల్లల వైద్యం, తల్లి--శిశు వైద్య సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వైద్య సేవలను మరింత విస్తరిస్తామని చెప్పారు.

# సింహపురిలో బిగ్ ఫైట్

**నెల్లూరు, సెప్టెంబర్ 3 పెన్ పవర్:** నెల్లూరు జిల్లా రాజకీయాల్లో అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం మరియు ఆధిపత్య పోరు ఒక్కసారిగా పీక్స్కు చేరింది. ముఖ్యంగా జిల్లాలో సాగుతున్న క్వార్ట్జ్ మైనింగ్ వివాదం మరియు అంతర్గత రాజకీయ విభేదాల నేపథ్యంలో, వైఎస్సార్సీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని టార్గెట్ చేస్తూ అత్యంత ఘాటు వ్యాఖ్యలతో సవాల్ విసిరారు."ప్రభాకర్ రెడ్డి.. నువ్వు నిజంగా మొగోడివైతే వెనక ఉండి రాజకీయం చేయడం ఆపి, నేరుగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడు" అంటూ బహిరంగంగా సవాల్ చేశారు. తనపై లేదా వైఎస్సార్సీపీ నేతలపై ఎలాంటి ఆరోపణలు చేయాలన్నా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడాలని నల్లపురెడ్డి డిమాండ్ చేశారు. మీ ఇంట్లో బాత్రూమ్లు కడిగే వాళ్లతోనో, సమాజంలో తిరిగే బ్రోకర్ గాళ్లతోనో ప్రెస్ మీట్లు పెట్టించి మాపై మాట్లాడించడం నీకు పద్ధతి కాదంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.తెరవెనుక ఉండి ఇతరుల ద్వారా ఇంటర్వ్యూలు ఇప్పించే దొంగచాటు రాజకీయాలు మానుకొని ధైర్యంగా తలపడాలని ఆయన హితవు పలికారు. ఇదే క్రమంలో మాజీ మంత్రి, వైస్సార్సీపీ కీలక నేత అనిల్ కుమార్ యాదవ్ ప్రస్తావనను నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి గట్టిగా లేవనెత్తారు. "నీకు అనిల్ కుమార్ యాదవ్ అంటే ఎందుకంత భయం? ఆయన పేరు వింటేనే ఎందుకు వణికిపోతున్నావు?" అంటూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. అనిల్ కుమార్ యాదవ్ గతంలో మైనింగ్ వ్యవహారాలపై సంధించిన ప్రశ్నలకు, చేసిన విమర్శలకు చేతనైతే మీడియా ముందుకు వచ్చి నేరుగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి సంబంధించిన ఆర్థిక, మైనింగ్ మరియు రాజకీయ అక్రమాలకు సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలు తమ వద్ద సిద్ధంగా ఉన్నాయని నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సమయం వచ్చినప్పుడు వాటన్నింటినీ ఆధారాలతో సహా ప్రజల ముందు బయటపెడతామని, మిమ్మల్ని అంత సులభంగా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇటీవల కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులపై వైఎస్సార్సీపీ నేతలు చేసిన విమర్శలు, ఆ తర్వాత జరిగిన దాడుల నేపథ్యంలో ఈ తాజా కౌంటర్ నెల్లూరు జిల్లా రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

## సజ్జల టార్గెట్ గా విజయసాయి పాలిటిక్స్

**విజయవాడ, సెప్టెంబర్ 3 పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, కొత్త రాజకీయ పార్టీ స్థాపించే దిశగా అడుగులు వేస్తున్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విడుదల చేసిన రెండు పేజీల ఓపెన్ లెటర్ ఆ పార్టీలో పెద్ద తుఫానునే సృష్టించింది. కేవలం ఆత్మరక్షణ కోసం మాత్రమే కాకుండా, ఏకంగా వైఎస్సార్సీపీ మునిగిపోతున్న నౌకగా మారడానికి ప్రధాన కారకుడు సజ్జల రామకృష్ణారెడ్డి అనబడే ఓ శక్తివంతమైన కోటరీనేనని ఆయన నేరుగా నిందించడం సంచలనం రేపింది. కొత్త పార్టీ ఆవిర్భావానికి ముందే సాయిరెడ్డి విసిరిన ఈ సవాలు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ చదరంగంలో సజ్జల పాత్రపై ఉన్న ఆరోపణలను ఒక్కసారిగా క్యాడర్ ముందుకు తీసుకొచ్చింది.గడిచిన కొన్నేళ్ల పరిణామాలను పరిశీలిస్తే, వైఎస్సార్సీపీ సాధించిన 2019 ఘనవిజయం తర్వాతి కాలంలో పార్టీలో సజ్జల ప్రభావం అమాంతం పెరిగిపోయిందనేది రాజకీయ వర్గాల్లో బహిరంగ రహస్యమే. అయితే ఆశ్చర్యకరంగా సజ్జల చేతికి తాడేపల్లి పవర్ సెంటర్ వచ్చినప్పటి నుంచే జగన్కు వరుస ఎదురుదెబ్బలు తగలడం మొదలయ్యాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితమై ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోవడం, ఢిల్లీ స్థాయిలో పార్టీకి సంబంధాలు తెగిపోవడం, కీలకమైన నంబర్-2 నాయకులంతా పక్కకు తప్పుకోవడం, చివరకు వైఎస్ కుటుంబంలోనే చీలిక వచ్చి షర్మిల, విజయమ్మలు దూరమవ్వడం వంటివన్నీ సజ్జల పర్యవేక్షణ కాలంలోనే జరిగాయి. సాయిరెడ్డి లేఖ సజ్జలపై విసిరిన విమర్శ మాత్రమే కాదు. అది జగన్ సొంతంగా నిర్ణయాలు తీసుకోలేరు, కోటరీ చేతిలో బందీ అయ్యారు అన్న సత్యాన్ని పార్టీ కేడర్కు నమ్మించేలా వేసిన పక్కా పొలిటికల్ స్కెచ్ 2024 దారుణ ఓటమి తర్వాత కూడా తాడేపల్లి గడప దాటి అసలు నిజాలు జగన్కు చేరకపోవడానికి సజ్జల వ్యవహారశైలే కారణమని గ్రామ స్థాయి నాయకుల వరకు తీవ్ర ఆక్రోశంతో ఉన్నారు. సాయిరెడ్డి బహిరంగంగా లేఖ రాయడం ద్వారా, ఆ నిరాశలో ఉన్న కేడర్ మొత్తాన్ని తన వైపు తిప్పుకోవడానికి లేదా వారిలోని అసమ్మతిని బయటకు తేవడానికి బలమైన పునాది వేశారు.జగన్ నమ్మకస్థుడిగా 15 నెలలు జైలు జీవితం గడిపిన సాయిరెడ్డి వంటి నేతను సైతం అవమానించి పంపేశారని చూపించడం ద్వారా, పార్టీ కోసం కష్టపడిన వారిని కాపాడుకోలేక కోటరీని మోసే నాయకుడు " అనే ముద్ర జగన్పై పడేలా చేశారు. ఇది భవిష్యత్తులో మిగిలిన ద్వితీయ శ్రేణి నేతలు కూడా పార్టీ మారడానికి మానసిక ధైర్యాన్ని ఇస్తుంది. విజయసాయిరెడ్డి లేఖతో ఇప్పుడు వైఎస్సార్సీపీ తాడేపల్లి వర్గాలు రక్షణ ధోరణిలోకి వెళ్లక తప్పడం లేదు. సజ్జలను సమర్థించుకుంటే సొంత పార్టీ శ్రేణులే తిరగబడే పరిస్థితి, ఆయనను పక్కన పెడితే తప్పు ఒప్పుకున్నట్లు అయ్యే పరిస్థితి జగన్కు ఎదురైందివిజయసాయిరెడ్డి సృష్టించిన ఈ రాజకీయ అలజడి కేవలం సజ్జల వర్సెస్ సాయిరెడ్డి యుద్ధం మాత్రమే కాదు. వైఎస్సార్సీపీ ఎంత త్వరగా తన తప్పులను సరిదిద్దుకోకపోతే అంత వేగంగా ఖాళీ అవుతుందనే హెచ్చరిక. ఢిల్లీ పెద్దలతో సంబంధాలు లేక, రాష్ట్రంలో ప్రజా క్షేత్రంలో నిలబడలేక, కుటుంబం అండ కోల్పోయి, ఇప్పుడు అంతర్గత కోటరీ రాజకీయాల్లో మునిగిపోతున్న వైఎస్సార్సీపీ నుంచి క్యాడర్ పక్కకు జరగడానికి సాయిరెడ్డి వేసిన ఈ టైమ్ బాంబ్ ' ప్రధాన కారణం కానుంది. ఈ లేఖ ద్వారా విజయసాయిరెడ్డి జగన్ను సజ్జల నుంచి వేరుచేసే ప్రయత్నం చేయలేదు. సజ్జలను నమ్ముకున్న జగన్కు పార్టీలో భవిష్యత్తు లేదనే సంకేతాన్ని క్యాడర్కు బలంగా పంపించారు. ఈ అగ్గి రాబోయే రోజుల్లో వైఎస్సార్సీపీలో ఎలాంటి రాజీనామాలు లేదా గ్రూపు జగడాలకు దారితీస్తుందో చూడాల్సి ఉంది.


# బంధం... బలపడుతోంది....

**విజయవాడ, సెప్టెంబర్ 3 పెన్ పవర్:** ఏపీలో రాజకీయాలు విచిత్రంగా ఉంటాయి. మూడు పార్టీల కూటమి ఒక వైపు.. మరోవైపు విపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంది. ఆ మూడు పార్టీల మధ్య బంధం స్ట్రాంగ్ గా ఉంది. అలా ఉన్నంతవరకు ఆ కూటమిని వైసిపి ఏం చేయలేదు అనేది మెజారిటీ విశ్లేషకుల భావన. అయితే ఐక్యం అనేది ఆ మూడు పార్టీల ఇష్టం. వైసిపి గెలవాలి అనుకున్నవారు కూటమి విచ్ఛిన్నం కావాలని కోరుకుంటారు. మెజారిటీ వైసీపీ శ్రేణులు కోరుకునేది అదే. అందుకే ఆ మూడు పార్టీల మధ్య విఘాతానికి చేయని ప్రయత్నం అంటూ లేదు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, లోకేష్ల మధ్య గట్టి తగాదా రావాలని బలంగా కోరుకుంటున్నారు. కానీ రోజు రోజుకి వారి మధ్య బంధం పెరుగుతూనే ఉంది కానీ.. తగ్గడం లేదు. పవన్ కళ్యాణ్ విషయంలో నారా లోకేష్ చేసిన ప్రకటన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతోంది.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు ఈరోజు. తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. కూటమి పార్టీల శ్రేణులు పాల్గొంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రముఖులు పవన్ కళ్యాణ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. అయితే అందరికంటే నారా లోకేష్ శుభాకాంక్షలు ప్రత్యేకంగా నిలిచాయి. సినీ అభిమానుల దృష్టిలో పవర్ స్టార్.. జనసైనికుల దృష్టిలో సేనాని.. నాకు మాత్రం దేవుడు ఇచ్చిన అన్న పవన్ అంటూ సంబోధించారు నారా లోకేష్. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. ఆ పార్టీ మీడియాతో పాటు సోషల్ మీడియా ఏవేవో వ్యాఖ్యానాలు చేస్తున్నాయి.పవన్ కళ్యాణ్ విషయంలో లోకేష్ మాత్రం చాలా ప్రత్యేకంగా చూస్తుంటారు. పవన్ కళ్యాణ్ జనసేన అధినేత. లోకేష్ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్. కానీ వారిద్దరి మధ్య బంధం బాగానే ఉంటుంది. అది ఎంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుచించదు. అందుకే లోకేష్ పవన్ విషయంలో స్పందించిన ప్రతిసారి వైసీపీకి ఎక్కడలేని కోపం. వారు భాగస్వామ్య పార్టీల అధినేతలు. ఆ పైవారు పరస్పరం గౌరవించుకుంటున్నారు కానీ ఈ విషయంలో ఎందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అతిగా రియాక్ట్ అవుతుందో తెలియడం లేదు. ప్రస్తుతం వైసీపీ అనుకూల మీడియాతో పాటు సోషల్ మీడియాలో.. పవన్ కళ్యాణ్ ను ఆకాశానికి ఎత్తేస్తున్న లోకేష్ అంటూ శీర్షికలు పెట్టి కథనాలు రాస్తున్నారు. వాళ్లు స్నేహితులు. వారు చేసుకోకపోతే ఎవరు చేస్తారు? అసలు ఈ విషయంలో వైసీపీకి ఎందుకు అంత ఉత్సాహం? అంటే వారు కలిసి ఉంటే తనకు సుఖం ఉండదు. తనకు విజయం దక్కాలంటే వారు కలిసి ఉండకూడదు. కానీ వారి మధ్య బంధం రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు.

**జెన్ జీ జపంలో జనసేనాని**

ఏపీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పవన్ పుట్టినరోజు సందర్భంగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది జనసేన. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ యువజన విభాగం పేరును 'జై కొట్టు' గా నామకరణం చేసింది. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఈ నూతన విభాగం 'జై కొట్టు'ను ఆవిష్కరించారు. జై కొట్టు పేరుతో ప్రత్యేకంగా ఒక పాటను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాను ఈ పాట షేక్ చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అంబరాన్ని తాకాయి.పవన్ కళ్యాణ్ గత కొద్దిరోజులుగా కేరళలో ఉంటున్న సంగతి తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అక్కడ ప్రకృతి వైద్యశాలలో వైద్య సేవలు పొందుతున్నారు. అందుకే తన జన్మదిన వేడుకలకు హాజరు కాలేకపోయారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా పవన్ జన్మదిన వేడుకలు అంబరాన్ని తాకుతున్నాయి. ఎక్కడికక్కడే బైక్ ర్యాలీలు చేపడుతున్నారు.. ఆలయాల్లో పూజలతో పాటు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జనసేనకు ముఖ్యంగా యువత బలం అధికం. అందుకే ఆ పార్టీ యువజన విభాగానికి ప్రత్యేక నామకరణం చేయాలని భావించారు. అందుకు పవన్ పుట్టినరోజు వేడుకలను వేదికగా చేసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ జన్మదిన వేడుకల్లో పార్టీ యువజన విభాగానికి జై కొట్టు అనే ప్రత్యేక పేరును పెట్టారు.మరోవైపు ఈ జై కొట్టు అనే నినాదానికి.. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ పాత తోడైంది.' జై కొట్టు' పేరుతో ప్రత్యేకంగా పాటను కూడా విడుదల చేశారు. ఈ పాటకు ధమన్ మ్యూజిక్ అందించారు.. అయితే ఇంత పెద్ద కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ హాజరు కాలేకపోయారు. అందుకే ఆయన ఆడియో మెసేజ్ పంపించారు. చెయ్యెత్తి జై కొట్టు నినాదం అందర్నీ ఆకట్టుకుంటుందని మనోహర్ అభిప్రాయపడ్డారు. ఆ స్ఫూర్తిని అందించాలనే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ లోగోను తీసుకొచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. జై కొట్టు నినాదంతో యువత ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలన్న ఉద్దేశంతోనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అరుపులు, కేకలు మాత్రమే కాదు. క్రమశిక్షణ కూడా ఎంతో ముఖ్యమని చెప్పారు

# ఫుల్ ఫైర్ లో ఏబీవీ.. చంద్రబాబుపై విమర్శలకు అస్సలు తగ్గని రిటైర్డ్ డీజీ!



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనపై రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ) చేస్తున్న విమర్శలు సోషల్ మీడియాలో హైలెట్ గా నిలుస్తున్నాయి. ఒకప్పుడు సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఏబీవీ, ఇప్పుడు ఆయనకు వ్యతిరేకంగా గళం విప్పుతుండటమే సంచలనంగా మారుతోంది. గత ఎన్నికలకు ముందు ఉద్యోగ విరమణ చేసిన ఏబీవీ కూటమి ప్రభుత్వంలో పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మనుగా నియమితులయ్యారు. అయినప్పటికీ ఆ పదవిని తీసుకోని ఆయన సొంతంగా పార్టీ పెడతానని ప్రకటించారు. ఈ దిశగా అడుగులు వేస్తున్న ఏబీవీ ప్రతిరోజు కూటమి ప్రభుత్వం పాలన విధానాలను ఎండగట్టేలా సోషల్ మీడియా వేదికగా చేస్తున్న విమర్శలు చర్చకు దారితీస్తున్నాయి.

ప్రభుత్వ వ్యతిరేక అజెండాతో పనిచేస్తున్న ఏబీవీ ప్రతి రోజూ ఏదో ఒక అంశాన్ని ఎత్తిచూపడం ద్వారా విమర్శకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ప్రధానంగా రాష్ట్రంలో లక్షలాది మంది రైతులు ఎదుర్కొంటున్న 22ఎ భూ సమస్యలపై ఏబీవీ మరికొందరు మేథావులతో కలిసి పోరాటం చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ రైతులను చైతన్యం చేయడంతోపాటు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవానికి ఈ సమస్యపై చొరవ తీసుకోవాల్సిన విపక్షం చేష్టలుడిగినట్లు చూస్తున్నా, ఏబీవీ ఒక్కరే ఒంటరి పోరాటం చేస్తూ ప్రభుత్వంలో కదలిక తీసుకువస్తున్నారని అంటున్నారు.ఇదే సమయంలో రాష్ట్రంలో ఇతర సమస్యలను ఏబీవీ వెలికి తీస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను వరుసగా ఎత్తిచూపుతున్నారు. ఇటీవల కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ కుటుంబం ఆత్మహత్య చేసుకున్న కేసు, రాజమండ్రి మెడికో హత్య కేసు విషయంలో ఏబీవీ లేవనెత్తిన ప్రశ్నలు ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని ఉలికిపాటుకు గురిచేశాయని అంటున్నారు. ఇక తాజాగా ఆయన సోషల్ మీడియా ద్వారా చేసిన మరో పోస్టు కూడా తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితిని కల్పించారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభిస్తూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబును ఒక పోస్టుతో రిటైర్డ్ డీజీ ఏబీవీ ఆత్మరక్షణలోకి నెట్టేశారని అంటున్నారు. గత నెల 31న మార్కాపురం జిల్లాలో ప్రారంభించిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవంతోపాటు బుధవారం (సెప్టెంబరు 2) పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు విడుదల చేసే సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన ప్రకటనలను విమర్శనాస్త్రంగా మార్చుకున్న ఏబీవీ ప్రభుత్వ పెద్దలను ఇరకాటంలోకి నెట్టారని అంటున్నారు.సాధారణంగా ప్రభుత్వ ప్రకటనలు జారీ చేసే సమయంలో ప్రోటోకాల్ పాటించాల్సివుంటుంది. సాగునీటి ప్రాజెక్టు ప్రారంభంలో ఆ శాఖ మంత్రి పేరు, ఫొటోలను కూడా పత్రికా ప్రకటనల్లో చేర్చాల్సివుంటుందని అంటున్నారు. కానీ, వెలిగొండ, పోలవరం జలాల విడుదల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటో లేకుండా ప్రకటనలు జారీ అయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన ఏబీవీ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు.సోషల్ మీడియాలో ఈ ప్రకటనకు సంబంధించిన ఫొటోలు షేర్ చేసిన ఆయన రాష్ట్రంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ మాత్రమే ప్రభుత్వాన్ని నడపొచ్చుకదా? అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ విషయంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను అనుసరిస్తున్నారా? అంటూ దెప్పిపొడవడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబును నేరుగా టార్గెట్ చేశారని అంటున్నారు. మీరు ముగ్గురే ప్రభుత్వంలో ఉన్నారా? మిగిలిన వారిని అవమానిస్తారా? అనే విధంగా ఏబీవీ విమర్శలు సంధించడం, దీనికి సాక్ష్యంగా పత్రికా ప్రకటనలను కూడా జత చేయడంతో ప్రభుత్వం ఇరకాటంలో పడినట్లే అంటున్నారు. మొత్తానికి కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టే విషయంలో రాష్ట్రంలో మిగిలిన నేతలు, పార్టీలకు భిన్నంగా ఏబీవీ నడుచుకోవడమే హాట్ టాపిక్ అవుతోంది.

# రోహిత్ శర్మ రిటైర్మెంట్ రూమర్స్‌కు బీసీసీఐ చెక్.. పుకార్లను నమ్మొద్దన్న దేవజిత్ సైకియా




**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌లో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే ఊహాగానాలకు బీసీసీఐ తెరదించింది. ముంబైలోని ప్రధాన కార్యాలయంలో ఈరోజు (సెప్టెంబర్ 3న) జరిగిన సమీక్షా సమావేశం అనంతరం రోహిత్ స్థానానికి ఎలాంటి ముప్పు లేదని భారత క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది. రోహిత్ భవిష్యత్తుపై ప్రస్తుతం యథాతథ స్థితి కొనసాగుతుందని, అతడు ప్రసుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జీత్ సైకియా స్పష్టం చేశారు.

**హై-వోల్టేజ్ మీటింగ్.. చీఫ్ సెలెక్టర్ అగార్కర్ గైర్హాజరీ:**

ఈ కీలక భేటీకి వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లతో పాటు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ నేరుగా హాజరయ్యారు. అయితే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ సమావేశానికి గైర్హాజరు కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబైకి దూరంగా ఇంటర్నెట్ సదుపాయం లేని ప్రాంతంలో ఉండటం వల్లే అగార్కర్ హాజరుకాలేదని సమాచారం ఉన్నప్పటికీ, ఆయన గైర్హాజరీపై క్రికెట్ వర్గాల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**లక్ష్మణ్ కొత్త రోల్, సెలెక్షన్ కమిటీ మార్పులపై క్లారిటీ:**


మరోవైపు వీవీఎస్ లక్ష్మణ్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ లాంటి కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నారంటూ వస్తున్న ప్రచారాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా

పూర్తిగా తోసిపుచ్చారు. అలాగే అజిత్ అగార్కర్ నాయకత్వంలోని సెలెక్షన్ కమిటీలో ఎలాంటి తక్షణ మార్పులు చేయడం లేదని ఆయన తేల్చి చెప్పారు. ఈ సమావేశానికి అగార్కర్ రాకపోయినప్పటికీ సెలెక్షన్ ప్యానెల్ తీరుపై ఎలాంటి అసంతృప్తి లేదని, ప్రస్తుతానికి అదే కమిటీని ముందుకు కొనసాగిస్తున్నట్లు బోర్డు తేల్చి చెప్పింది.

**రోహిత్ ఫామ్‌పై ప్రశంసలు.. వరల్డ్ కప్ రేసులో హిట్‌మ్యాన్:**

ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో లార్డ్స్ మైదానంలో 138 పరుగులతో విరుచుకుపడిన స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ బ్యాటింగ్ శైలిని దేవజిత్ సైకియా ప్రత్యేకంగా కొనియాడారు. రోహిత్ ఎంత అద్భుతంగా ఆడుతున్నాడో మీరు కూడా చూస్తున్నారు కదా అని వ్యాఖ్యానిస్తూ, అతని స్థానం ఇప్పటికిప్పుడు ఎలాంటి ప్రమాదంలో లేదూ, ప్రస్తుతం జరుగుతున్న పుకార్లకు అడ్డుకట్ట వేశారు. దీంతో 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్ శర్మ భాగస్వామ్యంపై బీసీసీఐ సానుకూలంగా ఉందనే విషయం స్పష్టమైంది.

# గాయమంటూ దొంగ నాటకాలు.. పాకిస్థాన్ ఓపెనర్‌పై రెండేళ్ల బ్యాన్..




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ ఓపెనర్ ఇమామ్-వుల్-హక్ అంతర్జాతీయ కెరీర్ తీవ్ర ప్రమాదంలో పడింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో గాయం పేరుతో దొంగ నాటకలు ఆడారనే తీవ్ర ఆరోపణలతో అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఏకంగా 2 ఏళ్ల పాటు బ్యాన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన ఇమామ్, రెండో టెస్టులో పిక్క కండరాల గాయం నెపంతో రెండు ఇన్నింగ్స్‌లలోనూ బ్యాటింగ్‌కు దిగలేదు. కానీ అతను నిజమైన గాయంతో బాధపడటం లేదని, కేవలం బ్యాటింగ్ నుంచి తప్పించుకునేందుకే డ్రామా ఆడాడని పాక్ క్రికెట్ బోర్డు (గ్రాజదీ) అనుమానిస్తోంది.

**పీసీబీ హై-లెవెల్ ఇంక్వైరీ:**

ఇమామ్ ఇలా గాయం పేరుతో డ్రామాలు ఆడటం ఇది మొదటిసారి కాదని తెలుస్తోంది. మార్చి 2025లో న్యూజిలాండ్ పర్యటనలోనూ ఇండోర్ నెట్ ప్రాక్టీస్ సమయంలో కుడి కాలి వేలికి గాయమైందంటూ మెడికల్ టీమ్‌ను తప్పుదోవ పట్టించి జట్టు నుంచి తప్పుకున్నట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. తాజాగా లార్డ్స్ టెస్టులో కూడా అదే పునరావృతం కావడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన పీసీబీ, ఇమామ్‌పై విచారణకు ఒక హై-లెవెల్ కమిటీని నియమించింది. విచారణలో అతడు దోషిగా తేలితే 1 నుంచి 2 ఏళ్ల పాటు క్రికెట్ ఆడకుండా కఠినంగా నిషేధించనున్నారు.

**మహమ్మద్ రిజ్వాన్ కెరీర్ ఎండ్ కార్డ్:**

మరోవైపు స్టార్ వికెట్ కీపర్, పాక్ మాజీ వైట్ బాల్ కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్ పరిస్థితి కూడా అత్యంత దారుణంగా తయారైంది. మూడో టెస్టుకు ముందే పీసీబీ జట్టు నుంచి తొలగించి పాకిస్థాన్‌కు పంపించిన 7 గురు ఆటగాళ్లలో రిజ్వాన్ కూడా ఉన్నాడు. జట్టులో క్రమశిక్షణారాహిత్యంతో ప్రవర్తించడం, మైదానంలో బాధ్యతారాహిత్యంగా చెత్త షాట్లు కొడుతూ వికెట్ పారేసుకోవడంపై పాక్ బోర్డు సీరియస్ అయింది. దీంతో రిజ్వాన్ అంతర్జాతీయ కెరీర్‌కు దాదాపు ఎండ్ కార్డ్ పడినట్లేనని, సమీప భవిష్యత్తులో అతను మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చే అవకాశాలు లేవని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**పాక్ క్రికెట్‌లో ఊచకోత.. షాక్‌లో ఆటగాళ్లు:**

ఇంగ్లాండ్ పర్యటనలో ఎదురైన పరాజయాల తర్వాత పాకిస్థాన్ క్రికెట్ బోర్డు జట్టులో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకంగా ఏడుగురు ప్లేయర్లను అర్థాంతరంగా టూర్ నుంచి తప్పించి స్వదేశానికి పంపడంతో లంక, ఇంగ్లాండ్ సిరీస్‌లు ఆడుతున్న ఆటగాళ్లు షాక్‌లో ఉండిపోయారు. ఒకవైపు డ్రెస్సింగ్ రూమ్ వివాదాలు, మరోవైపు ఇమామ్, రిజ్వాన్ వంటి సీనియర్లపై కఠిన చర్యలతో పాక్ క్రికెట్‌లో ప్రస్తుతం తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది.

# నేను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడటం లేదు.. చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో తన రోల్‌పై ఎంఎస్ ధోనీ క్లారిటీ!




**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్‌కింగ్స్ దిగ్గజం, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి తన రోల్‌పై కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు సీఎస్కే మాజీ ఆటగాడు ఎస్. బద్రీనాథ్ వెల్లడించాడు. రాబోయే సీజన్‌లో ధోనీపై వర్క్‌లోడ్ తగ్గించేందుకు అతనిని ఇంపాక్ట్ ప్లేయర్ గా వాడుకోవాలని ఫ్రాంచైజీ భావిస్తున్నప్పటికీ, తాను మాత్రం పూర్తిస్థాయి వికెట్ కీపర్‌గానే బరిలోకి దిగుతానని ధోనీ తేల్చిచెప్పాడట. తాను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడనని, 20 ఓవర్ల పాటు మైదానంలో ఉంటూ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తానని ధోనీ నాతో వ్యక్తిగతంగా చెప్పాడని బద్రీనాథ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పష్టం చేశాడు.

**వ్యూహాత్మకంగా మేలైనా.. ధోనీ పట్టుదల అదే:**

వయసు రీత్యా శరీరంలో ఫిట్‌నెస్ సమస్యలు ఎదురవుతున్నందున ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉపయోగిస్తే సీఎస్కేకు వ్యూహాత్మకంగా ఎంతో మేలు జరుగుతుందని బద్రీనాథ్ అభిప్రాయపడ్డాడు. ధోనీ శరీరం సుదీర్ఘ సమయం తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేకపోతోందని, అతను కేవలం 16వ ఓవర్ తర్వాతే బ్యాటింగ్‌కు వస్తున్నందున కీపింగ్‌కు బదులు ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడటమే ఉత్తమమని కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా భావించినట్లు గుర్తు చేశాడు. అయినప్పటికీ, మైదానంలో ఫుల్ టైమ్ ప్లేయర్‌గా ఉండటానికే ధోనీ ప్రాధాన్యత ఇస్తున్నాడని వివరించాడు.

**శివమ్ దూబే బౌలింగ్ వివాదం.. మేనేజ్‌మెంట్‌దే తప్పు:**

మరోవైపు, సీఎస్కే టీమ్‌లో శివమ్ దూబే బౌలింగ్ చేయకపోవడంపై వస్తున్న కథనాలను బద్రీనాథ్ ఖండించాడు. టీమిండియా తరఫున రెగ్యులర్‌గా బౌలింగ్ చేసే దూబేను సీఎస్కే తరఫున ఆడించేటప్పుడు ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన అడ్డువస్తోందనడం సరికాదన్నాడు. దూబే చేత బౌలింగ్ వేయించకపోవడం అనేది పూర్తిగా సీఎస్కే మేనేజ్‌మెంట్ వ్యూహాత్మక లోపమే తప్ప ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ తప్పు కాదన్నాడు. అతనిని కేవలం బ్యాటర్‌గానే ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఎందుకు ఉపయోగిస్తున్నారు? అని బద్రీనాథ్ ప్రశ్నించాడు.

**అకీల్ హొస్సేన్ ప్లేయింగ్ ఎలెవన్ లో తీసుకోండి:**

వెస్టిండీస్ స్టార్ స్పిన్నర్ అకీల్ హొస్సేన్‌ను ప్లేయింగ్ ఎలెవెంలో నేరుగా ఎంపిక చేయకుండా ఇంపాక్ట్ ప్లేయర్‌గా రిజర్వ్‌లో ఉంచడంపై కూడా బద్రీనాథ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. అకీల్ హొస్సేన్ కచ్చితంగా ప్రధాన జట్టులోనే ఉండాలని, కానీ సీఎస్కే మొదట సరిగ్గా బ్యాటింగ్ చేయకపోగానే అదనపు బ్యాటర్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా తెచ్చి హొస్సేన్‌ను బెంచ్‌కే పరిమితం చేస్తోందని మండిపడ్డాడు. ఇది తెలివితక్కువ నిర్ణయం.. మీ సొంత నిర్ణయాల లోపానికి ఐపీఎల్ నిబంధనలను నిందించడం సరికాదంటూ చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు.

# మహేష్ మైండ్ లో రన్ అవుతోన్న ఇద్దరే ఇద్దరు!

సూపర్‌స్టార్ మహేష్ -దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో అడ్వెంచర్ డ్రామా -వారణాసి- జాతీయ స్థాయిలో అంచనాలు అంతకంతకంతకు పెంచేస్తోంది. సినిమా కోసం మహేష్ ప్రత్యేకమైన ఫిజికల్ మేకోవర్ పొందుతూ ప్రపంచస్థాయి వర్క్‌షాప్‌లలో పాల్గొంటున్నారు. అయితే ఈ పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ తర్వాత మహేష్ తదుపరి చిత్రం ఏ దర్శకుడితో ఉండబోతోంది? అనే అంశం ఇప్పటికే ఫిలిం సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రాజమౌళి సినిమా తర్వాత మహేష్ ఎంచుకునే ప్రాజెక్ట్ అదే స్థాయిలో ఉండాలనే ఉద్దేశంతో ఆయన మైండ్‌లో ఇద్దరే ఇద్దరు పవర్‌ఫుల్ దర్శకులు రన్ అవుతున్నారని బలమైన ప్రచారం జరుగుతోంది.

వారిలో ఒకరు రా అండ్ రస్టిక్ యాక్షన్ మేకర్ సందీప్ రెడ్డి వంగా కాగా.. మరొకరు విజనరీ మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్. వీరిద్దరిలో ఒకరికే మహేష్ తదుపరి సినిమా చేసే అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తీర్చిదిద్దే క్యారెక్టరైజేషన్లు, హై-వోల్టేజ్ ఎమోషన్లు హీరోల ఇమేజ్‌ను సరికొత్తగా ఆవిష్కరిస్తాయి. మహేష్‌లోని వింటేజ్ మాస్ ,





ఇంటెన్సిటీని బయటకు తీసే సామర్థ్యం సందీప్‌కు ఉందని అభిమానులు సైతం భావిస్తున్నారు. గతంలోనే ఇద్దరి మధ్య చర్చలు జరిగినప్పటికీ, సరైన సమయం కోసం నిరీక్షించారు. తాజాగా -వారణాసి- తర్వాత మహేష్‌ను మరో స్థాయిలో నిలబెట్టే పవర్‌ఫుల్ కథ సందీప్ వద్ద ఉందనే వార్తలు తెరపైకి వస్తున్నాయి. మరోవైపు ప్రశాంత్ నీల్ తనదైన బిగ్ స్కేల్ లార్జర్ ద్యాన్ లైఫ్ ఎలివేషన్లకు, వరల్డ్ బిల్డింగ్‌కు పేరుగాంచారు. -కెజిఎఫ్-, -సలార్- వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ప్రశాంత్ నీల్ మేకింగ్ స్టైల్ మహేష్ మాస్ ఇమేజ్‌కు తోడైతే బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం తప్పదనే అంచనాలు ఉన్నాయి. ఇద్దరి కాంబినేషన్ కుదిరితే భారీ అంచనాలతో గ్లోబల్ వైడ్ మార్కెట్‌ను టార్గెట్ చేయడం సులువవుతుంది. రాజమౌళి కాంబినేషన్ తర్వాత ప్రతీ కథానాయకుడిపై మార్కెట్ ఒత్తిడి .. ప్రేక్షకుల అంచనాలు భారీ పెరుగుతాయన్నది వాస్తవం. అలాంటి సమయంలో ఏమాత్రం కాంప్రమైజ్ కాకుండా తన రేంజ్‌ను నిలబెట్టుకునేలా సందీప్ రెడ్డి వంగా లేదా ప్రశాంత్ నీల్‌లతో ముందుకు వెళ్లడమే సరైన వ్యూహమని మహేష్ భావిస్తున్నట్లు సమాచారం. ఇద్దరిలో ఎవరు ముందుగా మహేష్‌ను మెప్పించే స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తారో? వారితోనే ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. మొత్తానికి మహేష్ భవిష్యత్తు ప్రాజెక్ట్‌లపై స్పష్టమైన ప్లానింగ్‌తో ఉన్నట్లు కనిపిస్తోంది. సందీప్ రెడ్డి వంగా అందించే ఇంటెన్స్ డ్రామానా లేక ప్రశాంత్ నీల్ సృష్టించే లార్జర్ ద్యాన్ లైఫ్ యాక్షన్ వరల్డా అనే దానిపై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965